



# విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 23-01-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 130 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## ప్రజా సమస్యల అధ్యయనమే

# ప్రజాయాత్ర ధ్యేయం



- హారతి ఇచ్చి సాగనంపిన భార్య లెజినోవా
- కొండగట్టు అంజన్నను దర్శించుకున్న పవన్
- ఆలయ అభివృద్ధికి 11 లక్షల భూరివిరాళం
- సీఎం సీఎం.. అంటూ అభిమానుల నినాదాలు
- ఉత్సాహంగా ప్రారంభమైన ప్రజాయాత్ర
- కరీంనగర్ చేరుకున్న పవన్..
- కార్యకర్తలతో భేటీ....

హైదరాబాద్: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తన ప్రజా యాత్రను సోమవారం ప్రారంభించనున్నారు. సోమవారం ఉదయం తన నివాసం నుంచి ప్రశాసన్ నగర్‌లోని జనసేన కార్యాలయానికి చేరుకున్న పవన్‌కు కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు.

***హారతి ఇచ్చి సాగనంపిన భార్య***

భార్య లెజినోవా ఆయనకు హారతి ఇచ్చారు. అనంతరం పవన్ కారులో కొండగట్టుకు బయలుదేరారు. ఆ సమయంలో పవన్‌కు మద్దతుగా జనసేన కార్యకర్తలు పెద్దయెత్తున నినాదాలు చేశారు. పవన్ వెంట పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు సుమారు 50 వాహనాల్లో బయలుదేరారు.

***ఆలయ అభివృద్ధికి రూ. 11 లక్షల భూరి విరాళం***

పవన్ సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొండగట్టుకు చేరుకున్న జనసేనానికి ఆలయ పండితులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం పవన్ మాట్లాడుతూ ఆలయ అభివ ృద్ధికి తన శాయశక్తులా క ృషి చేస్తానని హామీఇచ్చారు. ప్రత్యేక పూజల తర్వాత పవన్ కల్యాణ్‌ను అర్చకులు వేద మంత్రోచ్చారణలతో ఆశీర్వదించారు. తనను తరువాయి 2లో

## నిర్మాణాత్మక రాజకీయాలు చేస్తా

**ప్రభుత్వాలతో గొడవపెట్టుకోను**

**జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్**



కరీంనగర్: ప్రభుత్వాలతో గొడవలు పెట్టుకునే ఉద్దేశమేదీ తనకు లేదని, నిర్మాణాత్మక రాజకీయాలు మాత్రమే తాను చేస్తానని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. ఈ నెల 27 నుంచి అనంతపురం జిల్లాలో తన పర్యటన ప్రారంభమవుతుందని తెలిపారు. కొండగట్టు ఆంజనేయస్వామి తరువాయి 2లో

### బంగారు తెలంగాణ అభివృద్ధికి

## అందరూ కలిసిరావాలి

**ఎన్నారైలు తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లు**

**మంత్రి కేటీఆర్ పిలుపు**



జురిచ్: బంగారు తెలంగాణ కల సాకారానికి ప్రవాస తెలంగాణ వాసులు కలిసి రావాలని మంత్రి కేటీ రామారావు పిలుపునిచ్చారు. స్విట్జర్లాండ్‌లోని జురిచ్ నగరంలో తెలంగాణ ఎన్నారైలు ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

ప్రభుత్వ పథకాలు, పాలసీలు, రాష్ట్రంలో వాటి అమలు తీరుతెన్నులు తదితర అంశాలపై ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులను సైతం ప్రస్తావించారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ప్రభుత్వం అద్భుతమైన ప్రగతి దిశగా రాష్ట్రాన్ని తీసుకెళ్తోందన్నారు. 15 ఏళ్ల క్రితం ఏర్పాటైన రాష్ట్రాలు కూడా ఇంకా పూర్తిగా కుదురుకోని పరిస్థితుల్లో ఉంటే తెలంగాణ రాష్ట్రం మాత్రం మూడున్నర ఏళ్లలోనే అనేక రంగాల్లో దేశానికి ఆదర్శవంతమైన విధానాలతో ముందుకెళ్తోందన్నారు. తెలంగాణ ప్రజలు ఆకాంక్షించిన లక్ష్యాల సాధన దిశగా ప్రయాణం మొదలైందని, ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో బంగారు తెలంగాణను సాధిస్తామని మంత్రి ఉద్ఘాటించారు.

ఎన్నారైలే తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లు అని కేటీఆర్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కలిసి రావాలని కోరారు. అనంతరం ఎన్నారైలు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి సమాధానాలు చెప్పారు.

జురిచ్ నగరంలో శ్రీధర్ గండె, అల్లు కృష్ణారెడ్డి , అనిల్ జాలా, కిశోర్ తాటికొండ తదితరులు నిరవహించిన ఈ కార్యక్రమానికి స్వీడన్, జర్మనీ, యూకే, స్విట్జర్లాండ్ దేశాల నుంచి తెలుగువారు హాజరయ్యారు.

## బాసరలో వైభవంగా వసంత పంచమి వేడుకలు

**జ్ఞానసరస్వతి దర్శనానికి పోటెత్తిన భక్తులు**



ముథోల్: బాసరలోని జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో సోమవారం వేకువజామున వసంత పంచమి వేడుకలు ప్రారంభమయ్యాయి.

అమ్మవారి దర్శనం, చిన్నారులకు అక్షర శ్రీకారాల కోసం వేకువజామున 2గంటల నుంచే భక్తులు బారులు తీరారు.

దీంతో అక్షరాభ్యాస మండపాలు, క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. దర్శనానికి 2గంటలు, అక్షర స్వీకారానికి 4గంటల సమయం పడుతోంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మరొకొద్దిసేపట్లో ప్రభుత్వం తరపున ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ నగేష్, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

## భారత నావికా దళ మహిళా నావికుల ఘన విజయం




న్యూఢిల్లీ : భారత నావికా దళానికి చెందిన నౌక ఐఎన్ఎస్‌వీ తరిణి ఫాల్క్‌లాండ్ దీవుల్లోని పోర్ట్ స్టాన్లీలో సోమవారం ప్రవేశించింది. ఈ నెల 18న కేప్ ఆఫ్ హార్న్‌ను దాటుకుని ఈ నౌక దూసుకెళ్ళింది.

విశేషం ఏమిటంటే ఈ నౌకలో సిబ్బంది అందరూ మహిళలే. ప్రపంచాన్ని చుట్టి రావడమే లక్ష్యంగా ఈ నౌకాయానం జరుగుతోంది. పోర్ట్ స్టాన్లీ నుంచి వచ్చే నెల 4న ఈ నౌక బయల్దేరే అవకాశాలు ఉన్నాయి.

భారత నావికాదళ అధికార ప్రతినిధి ఓ ట్వీట్ ద్వారా ఈ వివరాలు తెలిపారు. నావికా సాగర్ పరిక్రమ ఐఎన్ఎస్‌వీ తరిణి పోర్ట్ స్టాన్లీలో ప్రవేశించింది.

ఫాల్క్‌లాండ్స్ ప్రజలు, ఫాల్క్‌లాండ్స్ ఐలండ్స్ సీఈఓ గవర్నర్ నైజెల్ ఫిలిప్స్ , ఎస్ జార్జియా, శాండ్‌విచ్ ఐలండ్స్ కమిషనర్, ఎమ్మెల్యే తదితరులు భారత నావికా దళ నావికులకు స్వాగతం పలికి, అభినందించారు అని ట్వీట్ చేశారు. నావికా సాగర్ తరువాయి 2లో

## కోడిపందేలపై హైకోర్టు ఆగ్రహం



హైదరాబాద్: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో కోడిపందేలు నిర్వహిచడంపై తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ పందేల నిర్వహణపై తమకు నివేదిక ఇవ్వాలని గతంలో ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేయడంతో ప్రభుత్వంపై మండిపడింది. ఈ నెల 29న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్, డీజీపీ మాలకొండయ్య వ్యక్తిగతంగా తమ ఎదుట హాజరుకావాలని సూచించింది. సంక్రాంతి వేడుకల సందర్భంగా ఏపీలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన కోడి పందేల్లో కోట్లాది రూపాయాలు చేతులు మారాయన్న విషయం సర్వత్రా విదితమే.

## బాబుది మోసాల ప్రభుత్వం

**రైతుల భూములంటే అత్తగారి సొత్తా?**

**వడ్డీలేని రుణాలిస్తామని చెప్పి మోసం**

**చిత్తూరులో జగన్ ప్రసంగం**



చిత్తూరు : ఎస్సీలంటే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు చాలా చులకన అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలుగుదేశం పాలనలో ఎస్సీల అభివృద్ధి గురించి పట్టించుకోకపోగా.. నేతలు, అధికారులు దాడులకు తెగబడుతున్నారన్నారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా చిత్తూరు జిల్లా పల్లమాల గ్రామంలో నిర్వహించిన ఎస్సీల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న వైఎస్ జగన్ ప్రసంగించారు. తొమ్మిదేళ్ల పాలనలో ఎస్సీల బాగోగులను ఏ మాత్రం పట్టించుకోని చంద్రబాబు.. ఇప్పుడు కూడా అదే తంతు కొనసాగిస్తూ వస్తున్నాడని జగన్ అన్నారు. ప్రతీ కులాన్ని ఎలా మోసం చేయాలో చంద్రబాబు పీహెచ్‌డీ చేశారని... సీఎం పదవి కోసం తరువాయి 2లో



# హక్కులు ఆంధ్రావే!..తీర్పు అనుకూలం...మార్పు అనివార్యం

విజయనగరం: వివాదాస్పద కొఠియా గ్రామాలపై ఒడిశా యంత్రాంగం దూకుడు పెంచింది. ఆగ్రామాల్లో గేట్లను ఏర్పాటు చేసి, అటుగా వెళ్లి వచ్చే వారి కదలికలపై నియంత్రణ విధించేలా ఏర్పాటు చేసింది. దీంతో ఈ వ్యవహారంపై జిల్లా అధికారులు కూడా దృష్టి కేంద్రీకరించారు. చట్టపరమైన అన్ని హక్కులు ఆంధ్రప్రదేశ్‌కే ఉన్నాయని, ఇందుకు సంబంధించిన తీర్పులు కూడా అందుబాటులోకి వచ్చాయని అధికారులు చెబుతున్నారు. వీటిని అనుసరించి కొఠియా గ్రామాలపై పాలనను చేతిలోకి తీసుకొనేలా కార్యాచరణ చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే కలెక్టరు వివేక్‌యాదవ్ రాష్ట్ర ప్రభుత్వం ద ృష్టికి కొఠియా దూకుడును తీసుకువెళ్లినట్లు సమాచారం. అలాగే వీటిపై సమగ్ర సమాచారాన్ని వివరిస్తూ రాష్ట్రానికి గల హక్కులను కాపాడుకునేలా పార్వతీపురం ఐటీడీఏ పీవో లక్ష్మీశ కూడా ప్రభుత్వానికి ప్రత్యేక నివేదిక పంపించే దిశగా ఆలోచన చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ అధికారులు చెబుతున్న ప్రకారం కొఠియా గ్రామాలపై ఎలాంటి వివాదం లేదు. ఇవి పూర్తిగా ఆంధ్రప్రదేశ్ అధికార పరిధిలోకి వస్తాయని 2010 మే 5న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేత ృత్వంలోని నలుగురు న్యాయమూర్తుల ధర్మాసనం తీర్పును ఇచ్చింది. 1968లోనే ఒడిశా రాష్ట్రం విశాఖ, విజయనగరం సరిహద్దుల్లో ఉన్న కొన్ని గ్రామాలు ఒడిశా రాష్ట్ర పరిధిలో ఉన్నాయని, వాటిపై ఆంధ్రప్రదేశ్ ఆక్రమిస్తుందని కేసుపెట్టింది. ఈ కేసును విచారించిన సుప్రీంకోర్టు 2010లో తీర్పు వెలువరించింది. వివాదాస్పద గ్రామాలపై ఒడిశా చెబుతున్న మాటలు వాదనకు నిలవవని తేల్చిచెప్పింది. ఈ గ్రామాలు విజయనగరం జిల్లా పరిధిలోకి వస్తాయని కోర్టు స్పష్టం చేసిందని అధికారులు పేర్కొంటున్నారు. అందువల్ల కొఠియా గ్రామాలు కచ్చితంగా విజయనగరం జిల్లా పరిధిలోకే వస్తాయని, తీర్పును అధ్యయనం చేసి, దీనిపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు ఐటీడీఏ పీవో లక్ష్మీశ చెప్పారు.తీర్పు తర్వాతే ప్రేమ: సుప్రీం కోర్టు తీర్పు తర్వాతే ఒడిశా రాష్ట్రం వివాదాస్పద గ్రామాలుగా చెబుతూ ఆ గ్రామాలపై ప్రేమ పెంచుకుందని భావిస్తున్నారు. ఇప్పుడు కొఠియా గ్రామాల్లో చేపట్టిన పనులన్నీ 2010 తర్వాత చేసిన వేనని చెబుతున్నారు. కొఠియా గ్రామాలకు రహదారి సౌకర్యాన్ని గంజాయిభద్ర మీదుగా కల్పిస్తే.. ఒడిశా మీదుగా వెళ్లే పరిస్థితి తప్పుతుంది. తద్వారా కొఠియా గ్రామాల్లో మన అభివ ృద్ధి కార్యక్రమాలు అమలుచేసుకొని, ప్రజలకు మెరుగైన జీవనం అందివచ్చునని భావిస్తున్నారు. తక్షణం రూ.2 కోట్లు కేటాయిస్తే రహదారి సౌకర్యం యుద్ధప్రాతిపదికన కల్పించే వీలు కలుగుతుంది.

# గ్రీవెన్స్‌లో సమస్యల పరిష్కారం


ఏఒకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నర్సీపట్నం : తమకు నివాస స్థలాల మంజూరుకు చేయాలని కోరుతూ నక్కపల్లి మండలం దార్లపూడి గ్రామానికి చెందిన రెల్లి కులస్తులు నర్సీపట్నం ఆర్‌డిఒకు వినతిపత్రం సమర్పించారు. సోమవారం నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో పరిపాలానాధికారి ప్రకాశరావు వినతులను స్వీకరించారు. దార్లపూడి విద్యుత్ సబ్ స్టేషన్ ప్రాంతంలో రెల్లి కులానికి చెందిన కొన్ని కుటుంబాల వారు నివాసముంటూ పండ్ల వ్యాపారాలు నిర్వహించుకుంటూ ఉండేవారు. ఏలేరు కాలువ తవ్వకాల్లో వారు నివసిస్తున్న ప్రభుత్వ భూమి గుండా కాలువ తవ్వాల్సి ఉన్నందున వారు ఇళ్లు కోల్పోయి దగ్గరలో ఉన్న ప్రభుత్వ భూమిని తమకు కేటాయించాలని కోరుతూ 34 మంది విన్న వించుకున్నారు. నక్కపల్లి మండలం విశాఖ, చెన్నై కారి డార్ నిర్వాసితుల సంఘం అధ్యక్షులు ఎం.అప్పలరాజు నిర్వాసి తులకు 2013 భూసేక రణ చట్టం ప్రకారం డిఫారం భూములకు అది రాయితీ భూములతో సమానంగా ఎక రానికి రూ.18 లక్షల నష్టపరిహారం చెల్లిం చాలని కోరుతూ దరఖాస్తు చేశారు. పాకలపాడు శివారు వెంకటాపురంకు చెందిన లాలం ఎల్లమ్మ కుమార్తెలు తమ అమ్మమ్మ నాలుగు ఎకరాల భూమి తమ తల్లి మరణాంతరం కుమార్తెలు ముగ్గురికి చెందాల్సి ఉండగా తన పినతల్లి పట్టాదారు పాసు పుస్త కాలు రాయించుకొని మోసం చేసిందని ఫిర్యాదు చేశారు.

తమ వాటా భూమి తమకు ఇవ్వాలని దరఖాస్తు చేశారు. ఇంకా పట్టాదారు పాసు పుస్త కాలు మంజూరు చేయాలని, భూతగాదాలు మొదలైన వాటిపై దరఖాస్తులు, ఫిర్యాదులు అందజేశారు.

# సూర్యసదనంలో సౌర యాగం

విజయనగరం: మాఘ మాసాన్ని పురస్కరించుకుని గరివిడి పట్టణంలోని సూర్యసదనంలో సౌరయాగం ప్రారంభమైంది. ఇక్కడ 12 ఏళ్ల కాలదీక్షతో నిర్వహిస్తున్న ద్వాదశ వర్ష బ ృహత్సత్రయాగంలో అంతర్గతంగా ఈ సౌరయాగం చేపట్టినట్టు యాగాధ్వర్యులు వేమకోటి సూర్యనారాయణ శర్మ తెలిపారు. తొలిరోజు విశ్వశాంతి సంకల్పం, దీక్షాధారణ, అఖండ దీపస్థాపనతో యాగాన్ని ప్రారం భించారు. సూర్యారాధన విశిష్టత గురించి భక్తులకు ఉపదే శించారు.

# పందులతో ఇబ్బందులు



రావికమతం: కొత్తకోట గ్రామంలో పందులు జనావాసాల మధ్య సంచరిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా 13, 16 వార్డులో పందులు రోడ్డుపైనే ఉండటంతో ప్రజలు అటు వైపు వెళ్లేందుకు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు పందులు అడ్డంగా రావడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఒకాకొక సమయంలో అటుగా వెళ్లే చిన్న పిల్లలపై పందులు విరుచుకుపడుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

# 23న నారా లోకేష్ జన్మదిన వేడుకలు

సబ్బవరం: పెందుర్తి నియోజకవర్గంలోని పరరవాడ మండలంలోని ఈనెల 23న పంచాయితీరాజ్‌కు ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామని సబ్బవరం మండలం టీడీపీ పార్టీ అధ్యక్షుడు మిడతాడ మహలక్ష్మినాయుడు సోమవారం విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయితీరాజ్‌శాఖా మంత్రి నారా లోకేష్ జన్మదినం సందర్భంగా పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణవ ూర్తి పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు అప్పలనాయుడు ఆధ్వర్యంలో పరవాడ పోలీస్‌స్టేషన్ ఎదురుగా వున్న జెఎన్‌ఆర్‌ఎం ఆడిటోరియంలో మంగళవారం ఉదయం 9 గంటలకు భారీ రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అనంతరం నియోజకవర్గం సమన్వయ కమిటీ సభ్యులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జన్మభూమి కమిటీ సభ్యులు, గ్రామ కమిటీ ప్రెసిడెంట్, సెక్రటరీలు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు. మరియు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

# మండలంలో అమ్మకు వందనం కార్యక్రమం



రావులపాలెం : మండల పరిధిలో వసంత పంచమి పురస్కరించుకొని సరస్వతీ దేవి పుట్టినరోజు సందర్భముగా వాడవాడలా అమ్మకు వందనం కార్యక్రమం నిర్వహించారు. గోపాల పురం లో డిసిసి రిటైర్డ్ ఎజియం పి.ఆర్.కె. రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్త వనగంటి లక్ష్మి విద్యార్థు లచే తల్లులకు పాదాభిషేకం నిర్వహించారు. పిఆర్‌కె రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రులు పిల్లల యోగక్షేమాలు పట్టిం చుకోకుండా దిక్కులేనివారిగా విడిచి పెట్టేస్తున్నారని, ఇటువంటి కార్యక్రమాలు పిల్లల్లో తల్లిదండ్రు లపట్ల భక్తిభావం పెంపొందుతుం దన్నారు. పొడగట్లపల్లి శివారు లక్ష్మి పాలెంలో కార్యకర్త సంకు శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో పూర్వ ప్రాథమిక విద్య నభ్యసించుచున్న విద్యార్థినీ విద్యా ర్థులచే సరస్వతీ దేవి అమ్మవార్కి పూజలు నిర్వహించి పిల్లలకు పెన్ను లు, పలక, బలపాలను పంపిణీ చేసారు. విద్యార్థులచే తల్లిదండ్రు లకు పాదాభివందనం గావించి ఆశీర్వచనాలు పొందారు. అలాగే పొడగట్లపల్లి ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపా ధ్యాయులు బిహెచ్‌విఎస్‌ఎస్ సాయిరామ్ అధ్య క్షతన అమ్మకు వందనం కార్యక్రమం నిర్వ హించారు. విద్యార్థినీ విద్యార్థులచే తల్లిదండ్రు లకు పాదపూజ నిర్వహించి ఆశీర్వచనాలు పొందారు.

# గాజువాక జర్నలిస్టుకు ఆర్థిక సాయం
## అండగా వుంటామని శ్రీనుబాబు భరోసా



విశాఖపట్నం : స్టీల్ ప్లాంట్ వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గాజువాక సింహగిరి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లోకల్ ఛానల్ రిపోర్టర్ సురేష్‌ను ఎపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి, వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు , పెడరేషన్ నగర అధ్యక్షుడు పి నారాయణ్, బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇరోతి ఈశ్వరావు పరామ ర్శించారు. ప్రమాదం జరిగిన తీరును శ్రీనుబాబు అడిగి తెలుసుకున్నారు. 11 ఏళ్లు సురేష్ కుమారుడు కుడా తీవ్రంగా గాయిపడి ఆర్ కె అసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ సురేష్‌కు 12 వేల రూపాయిల అర్థిక సహాయాన్ని అందించడం జరిగిందని మరికొంత ఆర్థిక సహాయాన్ని అందించనన్నుట్టు తెలిపారు. సీనియర్ జర్నలిస్టులు పిఎస్ ప్రసాద్, గౌతమ్, గోవింద్, సంజీవ్, వాసు, అప్పలరాజు, శేషు, శశి, గణేష్ తదితర్లు పాల్గోన్నారు.

# డెకో ఆపరేషన్ పూర్తిగా నిలుపుదల చేయాలి

రావులపాలెం : స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ బిల్డింగు నందు సోమవారం అధ్యక్షులు కర్రి సుబ్బారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ ఈ 20 న కోనసీమ వ్యాప్తంగా జరిగిన సమావేశాన్ని బలపరుస్తూ డెకో ఆపరేషన్ పేరుతో వ్యాపారస్తులను పలు రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. దీనిని తక్షణం ప్రభుత్వం నిలుపుదల చేయాలని, అలా చేయని పక్షంలో పోరాటానికి వెనుకాడబోమని, త్వరలో కోనసీమ వ్యాప్తంగా పూర్తి స్థాని బందు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్యం సుబ్రహ్మణ్యేశ్వరరావు, మల్లిడి వెంకటరెడ్డి, జి. నాగేంద్ర, పి. నారాయణమూర్తి, ఆకుల శివ తదితరులు పాల్గొన్నారు.

# బెల్ట్ షాపు నిర్వాహకునిపై కేసు నమోదు

రావులపాలెం : కోనసీమ ముఖద్వారమైన రావులపాలెం పోలీస్ స్టేషను పరిధిలో ఒక పాన్ షాపులో రహస్యంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సోమవారం అమలాపురం స్పెషల్ స్క్వాడ్ ఎక్సైజ్ ఎస్సై షాపుపై దాడి చేసి 6 బాటిళ్లను స్వాధీనం చేసుకొని షాపు నిర్వాహకుడు గుడిమెట్ల ఆదిరెడ్డి పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై తెలిపారు.

# గానాల రామ్మూర్తి జయంతి సందర్భంగా వైద్యశిబిరం



అమలాపురం : స్థానిక విశ్వబ్రాహ్మణ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో దుడ్డివారి అగ్రహారంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. అమలాపురానికి చెందిన చిరంజీవ నర్సింగ్‌హోం అత్యవసర ఆసుపత్రి మరియు నందమూరి అభిమాన సంఘాల కన్వీనర్ బోళ్ళ సతీష్‌బాబు ల సహకారంతో నిర్వహించిన కార్యక్రమానికి పురపాలక సంఘాధ్యక్షుడు చిక్కాల వినాయకరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ డైరక్టర్ మెట్ల రమణబాబు, జిల్లా తెలుగుమహిళా కార్యనిర్వాహక కార్యదర్శి బండి రాధమ్మ తదితరులు హాజరై ప్రారంభించారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ కులములో ఆధునిక కాలంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల సంఘీయుల అభివృద్ధికి అవిరళ కృషిచేసిన ఆధునిక విశ్వబ్రాహ్మణ జాతిపిత, విశ్వబ్రాహ్మణకులంలో మొదటి ఎమ్మెల్సీ గానాల రామ్మూర్తి జయంతి సందర్భంగా వైద్యశిబిరం, రక్త పరీక్షలు ఏర్పాటు చేసినట్లు పట్టణ విశ్వబ్రాహ్మణసంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుపాటి వేణుగోపాల్ తెలిపారు. పెద్దసంఖ్యలో రోగులు హాజరై వైద్యపరీక్షలు చేయించుకున్నారు. వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తెదేపా పట్టణాధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, విశ్వబ్రామ్మణసంఘం జిల్లా అధ్యక్షుడు కట్టోజు సన్నియ్యదాసు, ఉపాధ్యక్షులు తాళాబత్తుల అప్పలాచార్యులు, నిర్వహకకమిటీ నాయకులు అనుపోజు శ్రీనివాస్, ఓడూరి సాయికిరణ్, పట్నాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# ప్రజా సమస్యల అధ్యయనమే ప్రజాయాత్ర ధ్యేయం



చల్లగా చూడాలని స్వామిని మొక్కుకున్నట్టు పవన్ కల్యాణ్ తెలిపారు. స్వామి ఆశీస్సులతోనే తాను 2009లో పెను ప్రమాదం నుంచి బయటపడినట్టు మరోసారి ఆయన గుర్తచేసుకున్నారు.

**సీఎం.. సీఎం.. అంటూ అభిమానుల నినాదాలు**

పవన్ అభిమానులుఅక్కడ హడావిడి సృష్టించారు. ఇద్దరు యువకులు ఓ కారుపైకి ఎక్కి పవన్ వైపునకు చూస్తూ అభివాదం చేసే ప్రయత్నం చేశారు. అభిమానులను అదుపు చేయడానికి పోలీసులు కొద్దిగా శ్రమించాల్సి వచ్చింది. అక్కడి నుంచి బయల్దేరి సాయంత్రం కరీంనగర్‌లో జనసేన స్థానిక ముఖ్య ప్రతినిధులతో మాట్లాడారు. నేడు కరీంనగర్ జిల్లా జగిత్యాల రోడ్‌లో శుభం గార్డెన్స్‌లో 10.45 నిమిషాలకు ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల జనసేన కార్యకర్తలతో సమావేశమవుతారు. మధ్యాహ్నం భోజనం అనంతరం కొత్తగూడెం బయలుదేరి వెళ్తారు. సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో కొత్తగూడెం చేరుకొని అక్కడే బస చేస్తారు. 24న ఉదయం 9.30 గంటలకు కొత్తగూడెం నుంచి ప్రదర్శనగా బయలుదేరి మధ్యాహ్నం 1.30 గంటలకు ఖమ్మం చేరుకుంటారు. 3 గంటలకు ఖమ్మంలోని ఎంబీ గార్డెన్స్‌లో జరిగే ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. తర్వాత హైదరాబాద్‌కు పయనమవుతారు.

**కరీంనగర్ చేరుకున్న పవన్..**

జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కొండగట్టులో కార్యక్రమాలు ముగించుకుని కరీంనగర్ చేరుకున్నారు. అక్కడ జనసేన కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ భేటీలో తన యాత్ర గురించి పవన్ చర్చించనున్నారు. తెలంగాణలో యాత్ర గురించి పవన్ ఏం మాట్లాడతారోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఆయన ఏ అంశాలు లేవనెత్తుతారు? ఏ అజెండాతో ముందుకు వెళతారు? ఎన్ని రోజులు యాత్ర చేస్తారు? ఆలయ అభివృద్ధికి రూ. 11 లక్షల చెక్కును అందజేశారు. ఇవాళ, రేపు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పర్యటించనున్న పవన్.. పార్టీ విధి విధానాలు అక్కడి నుంచే వెల్లడిస్తానని ప్రకటించడంతో రాజకీయంగా ఆసక్తి నెలకొంది. పవన్ రెండు రోజుల పర్యటనలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొని పలు నిర్ణయాలు తీసుకోనున్నారు.

## ఎస్సీలంటే బాబుకు చులకన

ఏ ఒక్క వర్గానికి కూడా ఆయన వదిలిపెట్టలేదని చెప్పారు. హామీలతో పెద్ద కొడుకునంటడు డోలు కొట్టే చంద్రబాబు... ఎన్నికలయ్యాక మాత్రం అత్తగారి సొత్తులా రైతుల భూములను లాగేసుకుంటాడన్నారన్నారు. ఐదు కోట్ల వరకు ఎస్సీలకు వడ్డీలేని రుణం ఇస్తామని చెప్పి.. ఆ హామీని కూడా నెరవేర్చలేదని జగన్ చెప్పారు.

## భారత నావికా దళ మహిళా నావికుల ఘన విజయం

పరిక్రమ పేరుతో ఈ నౌక పసిఫిక్ మహా సముద్రంలో 41 రోజులపాటు ప్రయాణించిందని, ఆ సమయంలో వాతావరణ పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నాయని ఓ ప్రకటనలో నావికా దళం తెలిపింది. 60 నాట్స్‌కు పైగా గాలులు, 7 మీటర్లకు పైగా కెరటాలు వచ్చాయని పేర్కొంది.

ఐఎన్ఎస్‌వీ తరిణి 56 అడుగుల పొడవైన నౌక. దీనిని మన దేశంలోనే నిర్మించారు. ఈ ఏడాదిలోనే దీనిని భారత నావికా దళంలోకి తీసుకొచ్చారు. ఇది మేక్ ఇన్ ఇండియాకు గుర్తుగా నిలుస్తుంది. మహిళలు సంపూర్ణ సాధికారత సాధించాలన్న జాతీయ విధానానికి అనుగుణంగా ఈ యాత్ర జరుగుతోంది. మహిళా శక్తిని ప్రపంచానికి చాటడమే దీని లక్ష్యం

## నిర్మాణాత్మక రాజకీయాలు చేస్తా

దర్శనానంతరం కరీంనగర్ చేరుకున్న ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 2009 ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు విద్యుత్ తీగలు తగిలి ప్రమాదం జరిగిందని, ఆంజనేయస్వామి దయ వల్ల అప్పుడు బయటపడ్డానని చెప్పారు. సంపూర్ణ రాజకీయ జీవితంలోకి రావాలనుకున్నప్పుడు ఆంజనేయస్వామిని దర్శించుకోవాలని అనుకున్నానని, అందుకే స్వామి వారిని దర్శించుకున్నానని చెప్పారు. స్వామిని నమ్మితే అసాధ్యాలు కూడా సుసాధ్యం అవుతాయన్న నమ్మకం తనకు ఉందని చెప్పారు. కార్యకర్తలతో ఆలోచించి ఏయే సమస్యలపై ఎలా ముందుకెళ్లాలనే విషయంపై చర్చిస్తామని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ ప్రజాయాత్ర ఈ నెల 27 నుంచి అనంతపురం జిల్లా నుంచి చేపడతామని పవన్ కల్యాణ్ తెలిపారు. జిల్లాలో రెండు మూడు రోజులు పర్యటన ఉంటుందన్నారు. ఆ తర్వాత ఒంగోలులో ఫ్లోరోసిస్, కిడ్నీ బాధితులను కలుస్తామన్నారు. అనంతరం విశాఖ జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లోనూ, కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రాన్ని పరిశీలిస్తానని చెప్పారు. అనంతపురం జిల్లా పర్యటన తర్వాత ఆయా పర్యటనలకు సంబంధించిన తేదీలను ఖరారు చేస్తానని తెలిపారు.

ప్రభుత్వాలతో గొడవలు పెట్టుకునే ఉద్దేశమేదీ తనకు లేదని పవన్ కల్యాణ్ అన్నారు. ప్రభుత్వాలను గౌరవించాల్సిన అవసరం ఉందని, రాజకీయ అస్థిరత కోసం తానెప్పుడూ మాట్లాడనని చెప్పారు. తానెప్పుడూ సునిశితంగా ఆలోచిస్తానని, సమస్యలకు ఎప్పుడూ గొడవలు పరిష్కారం కాదని అన్నారు. గొడవలతో ప్రజలకు ఇబ్బందులు కలిగే పని తాను చేయనని, నిర్మాణాత్మక రాజకీయాలు మాత్రమే చేస్తానని పవన్ కల్యాణ్ చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పోటీ చేస్తామని స్పష్టంచేశారు. ప్రస్తుతం పార్టీ సంస్థాగత నిర్మాణ దశలో ఉందన్నారు.

# 24న రామతీర్థంలో పందిరిరాటకు ముహూర్తం

విజయనగరం: జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన రామతీర్థంలో రథసప్తమి పర్వదినం పురస్కరించుకొని స్వామివారి కల్యాణోత్సవానికి ఈనెల 24న పందిరిరాట కార్యక్రమం నిర్వహిస్తామని దేవస్థానం ఇన్‌ఛార్జి కార్యనిర్వహణాధికారి ఎస్ఎస్‌వీఎస్ఎస్. ప్రసాద్ తెలిపారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ స్వామివారి కల్యాణ మహోత్సవంతో పాటు రథయాత్ర వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా 24న ఉదయం 8.30 గంటలకు దేవాలయం వద్ద పందిరిరాట వేస్తామని చెప్పారు. ఈ నెల 26న రాత్రి 8 గంటలకు దేవాలయానికి క్షేత్రపాలకులైన ఉమా సదాశివస్వామి కల్యాణం జరుగుతుందన్నారు. ఆ మరుసటిరోజు 27వ తేదీ రాత్రి 8.30 గంటలకు శ్రీరామచంద్రస్వామివారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తామని వెల్లడించారు. ఈనెల 30న ఉదయం 8 గంటలకు శ్రీమద్రామాయణ పారాయణ, వేదపఠనం, వైదిక సదస్యం ఉంటాయని, సాయంత్రం 6 గంటలకు పండిత పరిషత్తు, పండితులకు సన్మానం నిర్వహిస్తామని వివరించారు. అదేరోజు రాత్రి 10 గంటలకు స్వామివారిని రథంపై ఉంచి తీరువీధుల్లో రథయాత్ర మహోత్సవం నిర్వహిస్తామన్నారు. వచ్చేనెల 13న మహాశివరాత్రి ఉత్సవాలు, 14న భక్తులకు స్వామివారి దర్శనం, 15న స్వామివారికి మహాసంప్రోక్షణ చేపడతామని తెలిపారు. రామతీర్థం దేవస్థానంలో జరిగే ఈ కార్యక్రమాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు హాజరుకావాలని ఆయన కోరారు.

# అగ్ని బాధితులకు విశ్వరూప్ పరామర్శ

అమలాపురం : అమలాపురం రూరల్ మండలం బండారులంక నారాయణపేటలో జరిగిన అగ్ని ప్రమాద బాధితులు విత్తనాల సత్యనారాయణ, నాగరాజు కుటుంబాలను వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పినిపే విశ్వరూప్ పరామర్శించారు. బాధితులను తప్పక ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఆయన వెంట బండారులంక పిఎసిఎస్ అధ్యక్షులు బుల్లబ్బులు, దంగేటి మహేష్, ఎంపిటిసి పెనుమాల సునీత, ముషిణి నాగరాజు, బూరయ్య, జాన గణేష్, గుత్తుల రాంబాబు, దొంగ సత్తిబాబు, బండారులంక శెట్టిబలిజ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# నల్ల క్వారీ త్రవ్వకాల అనుమతులు వెంటనే రద్దు చేయాలి

## - జిల్లా కలెక్టర్‌కు సిపిఎం వినతి - సమస్య పరిష్కారానికి కలెక్టర్ హామీ



విశాఖపట్నం : విశాఖపట్నం జిల్లా, డుంబ్రిగుడ మండలం, కొర్రాయి పంచాయితీ పరిధిల్లో గల సర్వేనెం 191, 190, 192, 145, 144, 143, 196, 193, 197, 176, 175లో గల బల్లుగుడ, సాయినగర్, బుర్డివలస, గత్తరజిల్లేడ గ్రామాల పరిధిలో సుమారు 25 ఎకరాల నల్లక్వారీ త్రవ్వకాలు జరపాలని కుట్రపన్నుతున్నారు. ఈ క్వారీ త్రవ్వడానికి స్థానిక ఎమ్మెల్యే అనుచరుడైన రాజు అనే గిరిజనేతరుడు అక్రమంగా క్వారీ సర్వేలు చేసి చుట్టుప్రక్కల భూములు కొనుగోలుచేసినట్టు తెలుస్తున్నది. ఈ నల్లక్వారీ త్రవ్వకాలు జరిపితే సాయినగర్, బల్లుగుడ, బుర్డివలస, గత్తరజిల్లేడ, భీముడువలస గ్రామానికి చెందిన 30మంది గిరిజనుల పట్టా భూములు, 120 ఎకరాల భూమి నష్టపోతారు. 80 ఎకరాలకుపైగా మామిడి, కాఫీ, సిల్వర్‌ఓక్ చెట్లు ధ్వంసమౌతాయి. నీరు, ధుమ్ము,ధూళి కాలుష్యం వలన చుట్టు ప్రక్కల భూములకు కూడా తీవ్ర హాని కలుగుతుంది. నీరు పచ్చధనం పాడైపోతుంది. త్రాగునీరు ఎండిపోతారు. పూర్వనుండి నమ్మి వ్యవసాయం చేస్తూ జీవిస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోతారు. సాయినగర్, బల్లుగుడ గ్రామానికి వేరొకచోట తరలించబడుతుంది. ఈ రెండు గ్రామాల భూములు పూర్తిగా నష్టపోతుంది.

గిరిజన షెడ్యూల్డ్ ప్రాంతాల్లో 1/70 భూబదాలాయింపు చట్టం ప్రకారం గిరిజనేతరులు మైనింగ్ చేయడానికి, గిరిజనుల భూములు కొనుగోలు చేయడానికి ఎటువంటి హక్కులేదు. గిరిజన ప్రాంతంలో క్వారీ మైనింగ్ జరపాలంటే గ్రామసభ అనుమతి తప్పనిసరిగా వుండాలి. గ్రామసభ అనుమతి లేకుండా,పట్టా భూమిదారుల అంగీకారం లేకుండా అక్రమంగా క్వారీ త్రవ్వాలని సర్వేలు, రాళ్ళ పరీక్షలు చేయడం జరుగుతుంది. కావున వెంటనే నల్లరాయి త్రవ్వకాలు వెంటనే ఆపాలని, క్వారీ అనుమతులు రద్దుచేయాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేసింది. జిల్లా కలెక్టర్ గారు సానుకూలంగా స్పందించి వెంటనే సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కె.ధయానిధి తదితరులు పాల్గొన్నారు.

# పోస్టర్ ఫ్రీ నగరంగా విశాఖపట్నం

**- రోడ్డు మార్జిన్‌లను సక్రమంగా పరిశుభ్రపరచండి**

**- గెడ్డలు, కాలువలలో చెత్త వేయకుండా ప్రజలను చైతన్యవంతం చేయండి**

**- అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌కు పుట్‌పాత్‌లు వేయండి - సోర్స్ సెగ్రిగేషన్ సక్రమంగా నిర్వహించేలా చర్యలు**

**- పరిశుభ్రతకు ఆటంకంగా రహదారులపై వాహనాలు నిలపకండి - తడి-పొడి చెత్తను వేరువేరుగా నిల్వ చేయండి**

**- షాపులు, హెూటల్, స్వీట్‌షాప్‌లకు జరిమానా**

## - జివిఎంసి కమిషనర్ హరినారాయణన్



విశాఖపట్నం : పోస్టర్ ఫ్రీ నగరంగా విశాఖనగరాన్ని తీర్చిదిద్దాలని జివియంసి కమిషనర్ హరినారాయణన్ ఆదేశించారు. క్షేత్రపర్యటన లో భాగంగా సోమవారం 32వ వార్డు అక్కయ్యపాలెం, జగన్నాధపురం, దొండపర్తి ప్రాంతాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా కాలువలో చెత్త వేసినందుకు మహరాణి పార్లర్‌కు జరిమానా విధించారు. అదేవిధంగా రోడ్ మార్జిన్‌లను సక్రమంగా శుభ్రపరచాలని కోరారు. శ్రీనివాసనగర్ గెడ్డను పరిశిలించి గెడ్డలు, కాలువలలో చెత్త వేయకుండా చూడాలని, ప్రజలను చైతన్యవంతం చేయాలని ఆదేశించారు. అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లో పుట్‌పాత్ ఆక్రమించిన పూలకొట్టు యజమానికి ఒక వేయిరూపాయలు జరిమానా విధించారు. ప్రజారోగ్య సిబ్బంది, పట్టణ ప్రణాళిక సిబ్బంది ఎక్కువ కాలం వాహనాలను వదలివేసి పారిశుధ్యానికి ఆటంకం కల్గిస్తున్నందున వాటిని తొలగించి పరిశుభ్రం చేయాలని పేర్కొన్నారు.

అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి రోడ్‌లో పుట్‌పాత్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని అపార్ట్‌మెంట్‌వాసులు తడి-పొడి చెత్తను వేరుచేసి కార్మికులకు అందించాలని, అపార్ట్‌మెంట్ వాసులు తడి చెత్తను ఒకడబ్బాలో-పొడిచెత్తను వేరొక డబ్బాలో నిల్వ చేయాలని కోరారు. సోర్స్ సెగ్రేషన్‌ను బొడ్డేటి రెసిడెన్సీ, పి.సావిత్రిఎన్ క్లేవ్‌లలో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా మురుగుకు ఆటంకంగా ఉన్న కాలువలకు చెందిన మేన్‌హెూల్స్‌ను తొలగించి సిల్ట్ తొలగించాలని పేర్కొన్నారు. ఆర్.కె.బజార్ వద్ద నున్న గెడ్డలో పూడిక తొలగించాలని ఆదేశించారు. అదేవిధంగా అక్కడ గోడలకు పెయింటింగ్ చేయాలని కోరారు.

కాలువలు, పరిసరాలలో అపారిశుభ్రతకు గాను యస్.కె.యం.ఎల్.స్వీట్స్ మరియు బేకరీ యజమానికి ఐదువేల రుపాయలు జరిమానా విధించారు.ప్రజారోగ్యానికి భంగం కలిగిస్తే జరిమానా, కఠిన చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ ఎస్ రమణమూర్తిని, ఏ.యం.ఓ.హెచ్ డా.మురళీమోహన్‌ను ఆదేశించారు. రోడ్‌కు అవసరమైన చోట ఫ్యాచ్‌వర్క్ చేయించాలని పేర్కొన్నారు.



పర్యటనలో జోనల్ సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాండు, పట్నాయక్, టి.పి.ఓ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ తర్వాతే ఎవరైనా.. ఎస్డీఐ యువత



విశాఖపట్నం : స్కిల్ డెవలప్ మెంట్ ఇన్‌స్టిట్యూట్, విశాఖపట్నంలో సోమవారం అమ్మకు వందనం కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతీ స్త్రీలో అమ్మను చూడగలిగే పరిణితి, విజ్ఞతను యువత అలవరచుకోవాలని సంస్థ ఇంచార్జ్ సి.వి.ఎన్.దాసు అభిలషించారు. మన హృదయాలలో అమ్మను మించిన స్థానం లేదని, అమ్మ విలువ తెలియని మూర్ఖులే అతివలపట్ల అకృత్యాలకు పాల్పడుతుంటారని, ఈ పరిస్థితి మారాలని మేనేజరు శశిభూషణ్ అన్నారు. విద్యార్థులు తమకు తల్లులతో సమానంగా సంస్థలో శ్రద్ధగా సేవలు చేస్తున్న వసతి గృహ స్త్రీల పాదాలకు మొక్కి, పుష్ప జలాభిషేకం చేసి, వారి ఆశీస్సులందుకున్నారు. విద్యార్థులు, అధ్యాపకులు మహిళల పట్ల గౌరవం చూపుతామని ప్రతిజ్ఞ చేశారు.

# సమస్యల పరిష్కారానికి కృషి

విశాఖపట్నం : అర్హులకు ఇళ్లు కేటాయిస్తామని అధికారులు మీ ఇంటికి త్వరలోనే సర్వే చేస్తారని ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. పేద కుటుంబాలు ఇల్లు నిర్మించికుంటే ప్రభుత్వం నుంచి సాయం అందిస్తామన్నారు. ఆశిపాప వీధిలో రోడ్లు ఆధునీకరిస్తామన్నారు. బుక్కావీధిలో వీధి దీపాలకు మరమ్మతులు చేపడతామన్నారు. అంగటిదిబ్బలో ట్రాన్స్ ఫార్మర్‌కు రక్షణ గోడ నిర్మిస్తామన్నారు.

ఏవిఎన్ కళాశాల రోడ్డులో పాడైన మురుగుకాల్వలను ఆధునీకరిస్తామన్నారు. గాజుల వీధిలో నేటి నుంచి ఉదయం 8 గంటలకు తాగునీరు సరఫరా చేస్తామన్నారు. డయల్ యువర్ ఎమ్మెల్యేలో ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించారు. జెడిసి ఛక్రధర్, ఏపిడి నాగమణి, అధికారులు పాల్గొన్నారు.

# 200 మందికి ఉచిత హోమియో వైద్య సేవలు

భీమునిపట్నం : కలిగొట్ల సిద్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరం జరిగింది. ఫౌండేషన్ డైరెక్టర్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి సంస్థ కార్యాలయంలో ఆయన ప్రారంభించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరుకు శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో హోమియో వైద్యులు మోహన్ రావు ప్రసాద రావు సుమారు 200 మంది రోగులకు ఉచిత వైద్య సేవలు అందించారు.

# లయన్స్ క్లబ్ నార్త్ ఈస్ట్ అసోసియేట్ మెంబర్‌గా ఎం.వి. రాజశేఖర్ నియామకం



విశాఖపట్నం : లయన్స్‌క్లబ్ నార్త్ ఈస్ట్ కమిటీ వారి ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్ ఏరియాలో గల కార్యాలయ ప్రాంగణంలో 2018లో నిర్వహించవలసిన సేవా కార్యక్రమాల నిమిత్తం కమిటీ సభ్యులచే సమావేశం నిర్వహించినాము. ఈ సమావేశంలో సభ్యులందరి ఆమోదంతో లయన్స్‌క్లబ్ నార్త్ ఈస్ట్ అసోసియేట్ మెంబర్‌గా శాశ్వత ప్రాతిపదికన ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్‌ని నియమించడం జరిగింది. వీరు లయన్స్‌క్లబ్ నార్త్ ఈస్ట్ కమిటీ సభ్యులు నిర్వహించే సేవాకార్యక్రమాలలో పాల్గొనడమే కాకుండా మీడియా తరపున ప్రచారకర్తగా వ్యవహరిస్తారు. వీరిని లయన్స్‌క్లబ్ నార్త్ ఈస్ట్ అధ్యక్షులు కడిమిశెట్టి గాంధీ, కార్యదర్శి టి. రమణ గుప్త, కోశాధికారి కె.రాధల సమక్షంలో నియమించినాము.

ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ నార్త్ ఈస్ట్ ప్రతినిధి (ఎం.జె.ఎఫ్) ఎస్.సోమరాజు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారులను ఎస్టీ జాబితాలోకి చేర్చే వరకూ పోరాడుతాం



భీమునిపట్నం : భీమిలి మండమత్స్య కారుల సాదన సమితి ఆధ్వర్యంలో భీమిలి సముద్ర తీరంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా నల్ల జెండాలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. భీమిలి మత్స్యకారులు సంఘం నాయుకులు మాట్లాడుతూ దేశంలో 18 రాష్ట్రాలలో తమను ఎస్టీ, ఎస్సీ జాబితాలో చేర్చగా కేవలం ఆంధ్రా, తెలంగాణల్లో మాత్రమే బి.సి.లుగా గుర్తిస్తున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో తెలుగుదేశం మ్యానిఫెస్టోలో మత్స్య కారులను ఎస్టీ జాబితాలో చేర్చుతా మని హామీ ఇచ్చారని నాలుగు ఏళ్ళు అవుతున్నా కనీసం పట్టించు కోవడం లేదని అన్నారు.

న్యాయమైన కోరికలు తీర్చాలని అడిగితే మమ్ములను కించ పరిచే విధంగా సీ.ఎం. చంద్రబాబు నాయుడు మాట్లాడం శోచనీయమని, అందువల్ల మత్స్యకారులను ఎస్టి జాబితాలోకి చేర్చే వరకూ పోరాటాన్ని ఆపేది లేదని దీనిని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పాత బస్సు స్టాండ్ కూడలిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. గంటా నూకరాజు మాట్లాడుతూ తీర్రపాంత మత్స్యకారులు చాలా దుర్భర స్థితులు అనుభవిస్తున్నారనీ, సముద్రంలో చేపలు పట్టడానికి వెళ్లి చాలా ఇబ్బందులు పడుతున్నారనీ అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మత్స్యకారులను గుర్తించి ఎస్టీ జాబితాలోకి చేర్చాలనీ డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారుల నాయకులు, అల్లిపిల్లి నరసింగరావు, వాసుపల్లి కొండబాబు, మైలపల్లి లక్ష్మణరావు, కదిరి ఎల్లయ్య నొల్లి రమణ, కదిరి జగన్నాదం, వి. గరగయ్య, కాసరపు నాగరాజు, వాసుపల్లి హరిబాబు కొక్కిరి అప్పన్న, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.



గ్రేటర్ విశాఖ 27వ వార్డు సాయి పూజా ఫౌండేషన్ రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి శస్త్ర చికిత్సా శిబిరాన్ని నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ వానపల్లి రవికుమార్ ప్రారంభించారు. 1996 నుంచి ఇప్పటి వరకు 6000 మందికి ఆపరేషన్‌లు, కంటి అద్దాలు మరియు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జగన్నాధం, అప్పారావు, ఈశ్వరరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# స్కీం వర్కర్ల సమ్మెకు సిపియం సంపూర్ణ మద్దతు

విశాఖపట్నం: ప్రభుత్వ పథకాలకు బడ్జెట్ పెంచాలని, కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, రాజకీయ వేదింపులు వంటి సమస్యలపై స్కీం వర్కర్లలైన అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నభోజనం కార్మికులు జనవరి 23న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు సిపియం విశాఖ జిల్లా కమిటీ సంపూర్ణ మద్ధతు తెలియజేస్తుందని సిపిఐ(ఎం) కార్యదర్శి కె. లోకనాథం ఒక ప్రకటనలో తెలిపారు.

ఐసిడిఎస్ ను కాపాడుకోవటానికి, ఉద్యోగభద్రత, కనీస వేతనం, పెన్షన్, సామాజిక భద్రత సౌకర్యాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కీం వర్కర్ల పట్ల అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయని, తల్లి బిడ్డల పరిరక్షణకు ప్రవేశపెట్టిన ఐసిడిఎస్ అమలుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు తగ్గిస్తున్నాయన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ కార్యక్రమాలు, సర్వేలు పేర్లుతో సెంటర్లులో ఉండనీయ్యకుండా అనేక అదనపు పనులు అప్పగించి అంగన్‌వాడీ కేంద్రాలు సరిగా పని చేయుట లేదని నేపంవేయడం దుర్మార్గం.

బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మిడ్డే మీల్స్‌కు 2014-15 రూ 13,215 కోట్లుగా ఉన్న బడ్జెట్‌ను 2017లో రూ10,000 కోట్లకు తగ్గించింది. పేద వర్గాలకు ప్రయోజనకరంగా ఈ పథకానికి బడ్జెట్‌లో భారీగా కోత విధించడం అన్యాయమన్నారు.

ఆశా వర్కర్స్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేతనాలు చెల్లంచకుండా పారితోషికాల పేరుతో వెట్టి చాకిరి చేయిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కీం వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపియం పార్టీ డిమాండ్ చేస్తోందని హెచ్చరించారు.

# మెగా ఉచిత వైద్యశిబిరం



భీమునిపట్నం : లయన్స్ క్లబ్ (విశాఖ), లయన్స్ క్లబ్ భీమిలి సెంటేనియల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న మెగా ఉచిత వైద్య శిబిరం స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి కళ్యాణ మండపంలో జరిగింది. అసోషియేషన్ ఆఫ్ ఇండియన్ ఫిజీషియనన్స్ నార్త్ ఒహియో వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరంలో 25 మంది యు.ఎస్. ఎ నుంచి వైద్యనిపుణులు వచ్చి ఉచితంగా కేన్సర్, కీళ్ల నొప్పులు, దంత, చిన్నపిల్లలు, స్త్రీలను పరీక్షించి వారికి తగిన మందులు సుమారు 200 మందికి ఉచితంగా పంపిణీ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ జీ.వాసురావు, వైస్ ప్రెసిడెంట్ కె. సునీత, సెక్రటరీ ఎం. భాస్కరరావు, మెంబర్లు ఎం. బాలసుబ్రహ్మణ్యం, కె.ఎస్.ఎన్. మూర్తి, బొండా నర్సింమూర్తి, కె. రామునాయుడు, ఎ. రామునాయుడు, కె. శ్రీనివాసు, కె. జగన్నాధం, గంటా నూకరాజు తదితరులు పాల్గొన్నారు

# అప్లయిడ్ మేథమేటిక్స్‌లో ఇద్దరికి డాక్టరేట్



ఏయూ : ఆంధ్రవిశ్వవిద్యాలయం అప్లయిడ్ మేథమేటిక్స్ విభాగ పరిశోధక విద్యార్థులు యు.వై దివ్య ప్రశాంతి, వై.ఆదిత్య లకు వర్సిటీ డాక్టరేట్ లభించింది. సోమవారం ఉదయం వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావు తన కార్యా లయంలో విద్యార్థులకు ఉత్తర్వులు అందజేసి అభినందించారు. దివ్య ప్రశాంతి వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు పర్యవేక్షణలో ' స్టడీ ఆఫ్ సమ్ డార్క్ ఎనర్జీ అండ్ స్ట్రింగ్ మోడల్స్ ఇన్ సర్టెన్ ఆల్టర్నేటివ్ ఆఫ్ గ్రావిటేషన్ అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది.

## విజయభాను సంపాదకీయం

# అనర్హత వేటు!

ఢిల్లీ శాసన సభ్యుల సంఖ్య 70 అయినందున, రాజ్యాంగం ప్రకారం అక్కడ ముఖ్యమంత్రితో సహా ఏడుగురు మంత్రులు మాత్రమే ఉండాలె. ఈ సమస్యను అధిగమించడానికి, పాలనా సౌకర్యం కోసం కొందరిని పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమించుకునే విచక్షణ ముఖ్యమంత్రికి ఉండకూడదా? ఈ మాత్రం దానికి కొంపలు మునిగినట్టు- న్యాయస్థానాలలో పిటిషన్లు వేసి పరిపాలనకు ఆటంకం కలిగించడం అవసరమా? రాజకీయాలలో విలువలను కాపాడవలసిందే. చట్టబద్ధ పాలన సాగించవలసిందే. ఢిల్లీ శాసన సభలోని ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఇరువై మంది ఎమ్మెల్యేలు లాభదాయక పదవుల్లో ఉన్నందుకు, వారిని అనర్హులుగా ప్రకటించాలని ఎన్నికల కమిషన్ రాష్ట్రపతికి సూచించడంతో ఈ అంశం మళ్ళా చర్చానీయాంశం అయింది. ఈ ఎమ్మెల్యేలు ఎన్నికల కమిషన్ సూచనను వ్యతిరేకిస్తూ న్యాయ స్థానాన్ని ఆశ్రయించవచ్చు. అనర్హత తప్పకపోతే ఈ ఇరువై స్థానాలకు ఉపఎన్నికలు జరుగుతయి. ఆమ్ ఆద్మీ పార్టీకి అసెంబ్లీలో భారీ మెజారిటీ ఉన్నందు వల్ల వీరు అనర్హులైనప్పటికీ ప్రభుత్వానికి ముప్పేమీ లేదు. కానీ ఇరువై స్థానాలకు ఒకేసారి ఉప ఎన్నికలు జరిగితే మాత్రం సంచలనమే. వచ్చే ఏడాది పార్లమెంటు ఎన్నికలు ఉన్నందున, ఈ ఉప ఎన్నికలు ఆసక్తికరంగా మారుతయి. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ పార్లమెంటరీ కార్యదర్శులను నియమించడంపై కొంతకాలంగా వివాదం సాగుతున్నది. వీరికి జీత భత్యాలు, వసతులు కల్పించడం లేదని ఢిల్లీ ప్రభుత్వం స్పష్టం చేసింది. పార్లమెంటరీ కార్యదర్శి పదవి లాభదాయక పదవి పరిధిలోకి రాకుండా, ఢిల్లీ అసెంబ్లీ మొదట్లోనే తీర్మానం కూడా చేసింది. కానీ ఈ తీర్మానాన్ని రాష్ట్రపతి ఆమోదించలేదు. లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం లేదనే కారణంగా వీరి నియామకాన్ని హైకోర్టు కొట్టివేసింది. దీంతో వీరు ఆ పదవులను కోల్పోయారు. ఇప్పటికే లాభదాయక పదవులు నిర్వర్తించిన నేపథ్యంలో వీరిని అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ ఒకరు రాష్ట్రపతికి పిటిషన్ పెట్టుకున్నారు. దీని పర్యవసానంగా వీరిపై కత్తి వేలాడుతున్నది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో చట్టసభ ప్రభుత్వాన్ని నియంత్రిస్తుంది. ఈ నేపథ్యంలో చట్టసభ సభ్యులు ప్రభుత్వ ప్రలోభాలకు లొంగకుండా స్వతంత్రంగా వ్యవహరించాలనే ఉద్దేశంతో, వీరు లాభదాయక పదవులు నిర్వహించకూడదని రాజ్యాంగం నిర్దేశిస్తున్నది. అయితే ఏది లాభదాయక పదవి అనే సందిగ్ధత నెలకొన్నది. వివిధ సందర్భాలలో న్యాయస్థానాల తీర్పుల ప్రాతిపదికగా కొంత స్పష్టత ఏర్పడ్డది. అయినప్పటికీ ఈ విషయంలో సందర్భానుసా రం విజ్ఞతతో వ్యవహరించాల్సిందే తప్ప స్పష్టంగా రేఖ గీయడం సాధ్యం కాదు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు విధాన నిర్ణయాలలో సోనియాగాంధీ క్రియాశీల పాత్ర తెలిసిందే. సోని యా ఎంపీగా ఉంటూనే, జాతీయ సలహా మండలి అధ్యక్షురాలిగా వ్యవహరించారు. దీనివల్ల ఆమె లాభదాయక పదవిలో ఉన్నారనే వివాదం తలెత్తింది. ఈవివాదం నుంచి బయటపడటానికి సోని యా ఎంపి సీటుకు, జాతీయ సలహా మండలి అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఆ వెంటనే జరిగిన ఉప ఎన్నికలో మళ్ళా లోక్‌సభకు ఎన్నికయ్యారు. జాతీయ సలహా మండలితో పాటు, మరో 55 రకాల పదవులను లాభదాయకత నుంచి మినహాయించే బిల్లును పార్లమెంటు ఆమోదించింది. కానీ నాడు రాష్ట్రపతిగా ఉన్న అబ్దుల్ కలాం ఈ బిల్లును తిప్పిపంపారు. లాభదాయక పదవి నిర్వచనం అస్పష్టంగా ఉన్నదని, దీన్ని అన్ని రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఏకరీతిలో వర్తింపజేయాలని రాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. కానీ ఏ సవరణలు చేయకుండానే బిల్లును రెండవసారి పంపడంతో కలాం ఆమోదించారు. ఈచట్టం ద్వారా మినహాయింపు లభించిన తరువాత సోనియా మళ్ళా జాతీయ సలహా మండలి అధ్యక్ష పదవి చేపట్టారు. పార్లమెంటరీ కార్యదర్శుల విషయమై వివాదం సాగుతున్నప్పటికీ, ఈ నియామకాలు కొత్తవేమీ కాదు. బ్రిటన్‌తో సహా పలు దేశాలలో పూర్వకాలం నుంచి ఉన్నాయి. సహాయ మంత్రి మాదిరిగా, దీనిద్వారా మంత్రి పదవికి తర్ఫీదు లభిస్తుంది. మంత్రులకు భారం తగ్గుతుంది. 1990 దశకం చివరిలో బీజేపీకి చెందిన సాహిబ్‌సింగ్ వర్మ ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒక ఎమ్మెల్యేను పార్లమెంటరీ కార్యదర్శిగా నియమించుకున్నారు. కాంగ్రెస్‌కు చెందిన షీలాదీక్షిత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ముగ్గురు ఎమ్మెల్యేలు పార్లమెంటరీ కార్యదర్శులుగా ఉన్నారు. హర్యానా, పంజాబ్, మధ్య ప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక తదితర పదకొండు రాష్ట్రాలలో పార్లమెంటరీ కార్యదర్శులు ఉన్నారు. ఈ పార్లమెంటరీ కార్యదర్శుల నియామకంపై పంజాబ్- హర్యానా హైకోర్టులో వ్యాజ్యం నడుస్తున్నది. తెలంగాణ రాష్ట్రంలో నియామకాలకు హైకోర్టు స్టే ఇచ్చింది.

# ఎసిసిఎలో గీతం విద్యార్థుల అరుదైన ఘనత

## బికామ్ విద్యార్థికి అంతర్జాతీయ సభ్యత్వం



విశాఖపట్నం: దేశాలలో గుర్తింపు కలిగిన అసోసియేషన్ ఆఫ్ ఛార్టర్డ్ సెర్టిఫైడ్ అకౌంటెంట్స్ (ఎసిసిఎ) ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన పరీక్ష లలో గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం మేనేజ్‌మెంట్ విద్యావిభాగం విద్యా ర్థులు అరుదైన ఘనత సాధించారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ద్వారా బి.కామ్ (ఆనర్స్) కోర్సు అభ్యసిస్తున్న నేమాని రేవంత్ ఎసిసిఎ నిర్వహించిన అన్ని పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి ఎసిసిఎ అంత ర్జాతీయ సభ్యుడిగా అర్హత సాధించగా మరో 45 మంది విద్యా ర్థులు 55 వరకు ఎసిసిఎ సబ్జెక్టు పరీక్షలలో ఉత్తీర్ణ లయ్యారని ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.షీలా తెలిపారు. అత్యంత కష్టసాధ్యమైన ఎసిసిఎ సబ్జెక్టులు కార్పొరేట్ రిపోర్టింగ్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అనాలసిస్, అడ్వాన్స్‌డ్ పెర్‌ఫార్మెన్స్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, ఆడిట్ అండ్ ఎస్యూరెన్స్‌లలో సైతం విద్యార్థులు ప్రతిభ కనిబరిచారని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాలలో బికామ్(ఆనర్స్)తో కలిపి ఎసిసిఎకు శిక్షణ ఇస్తున్న ఏకైక విద్యాసంస్థగా గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ గుర్తింపు పొందిందని వెల్లడించారు. బికామ్ ద్వితీయ, తృతీయ సంవత్సరం కోర్సు అభ్యసిస్తున్న సమయంలోనే విద్యార్థులు ఎసిసిఎలో ఉత్తీర్ణత సాధించడం పట్ల వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.ఎస్.ప్రసాద రావు, కె.శివరామకృష్ణ, రిజిస్ట్రార్ ఎం.పోతరాజు అభినందించారు.

# ధ్యానం వలన మానసిక ప్రశాంతత



అచ్యుతాపురం: ద్యానం చేయడం వలన మానసిక ప్రశాంతత చేకూరుతుందని బ్రాండిక్స్ ఇండియా పార్ట్‌నర్ దొరస్వామి అన్నారు. సోమవారం ఆయన మండలం లోని హరిపాలెం-అందలాపల్లి గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ గిజా పిరమిడ్ నిర్మాణానికి బ్రాండిక్స్ సంస్థ ద్వారా లక్ష రూపాయల విరాళం అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రమ్మర్షి పత్రీజీ ఆద్వర్యంలో ఈ పిరమిడ్ నిర్మాణాన్ని లీల ప్రసన్న కుమారి చేపడుతున్నారన్నారు. ద్యానం చేయడం వలన దాని ప్రభావం మన సరీరంతో పాటు ఆరోగ్యంపైనా చూపుతుందన్నారు. ద్యానం వలన ఉపయోగాల గురించి గ్రామీణ ప్రాంతాలలో తెలియజేయాలన్నారు.

శ్రీగిజా పిరమిడ్ నిర్మాణానికి అందరూ సహకరించాలన్నారు.

# ఘనంగా అమర్ జన్మదిన వేడుకలు



అనకాపల్లి : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా రధసారది, అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త, గుడివాడ అమర్‌నాధ్ జన్మదిన వేడుకలను అనకాపల్లి పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. మూడు రోజుల ముందు నుండే నగరం నలుమూలలా బారీ ప్లెక్సీలు ఏర్పాటు చేసి పండగ వాతావరణంలో తయారు చేసారు. నాగులాపల్లి బైపాస్ జంక్షన్ నుండి అనకాపల్లి వైసిపి పార్టీ కార్యాలయం వరకు గుడివాడ అమర్‌నాధ్‌ను పార్టీ కార్యకర్తలు ర్యాలీగా తీసకువెళ్లారు. మహిళలు హారతులతో స్వాగతం పలకగా కార్యకర్తలు బారీ బాణా సంచాతో స్వాగతం పలికారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఆళ్లనాగేశ్వరరావు దంతులూరి శ్రీదర్ రాజు గజమాలతో అమర్‌ను సత్కరించారు.

రానున్న రోజులలో వైఎస్ఆర్ పార్టీదే విజయమని నినానాదాలతో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు సమక్షంలో కేక్‌ను అమర్‌నాద్ కట్ చేసారు. అమర్‌నాద్ మాట్లాడుతూ పార్టీ విజయానికి కృషి చేసే ప్రతి కార్యకర్తలకు భవిష్యత్ ఉంటుందని బరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా వరుదు కళ్యాణి, బొడ్డేడ ప్రసాద్, దంతులూరి దిలీప్ కుమార్, మళ్ల బుల్లిబాబు, హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జాజుల రమేష్, వేగి త్రినాద్, సూరిశెట్టి రమణఅప్పారావు, భీశెట్టి జగన్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో సరస్వతీదేవికి పూజలు




అచ్యుతాపురం: స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో వసంత పంచమి సందర్భంగా సోమవారం సరస్వతీ దేవికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు మాట్లా డుతూ సరస్వతీ దేవి పుట్టినరోజు సందర్భంగా ఈ పూజా కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

## కవి సమయం

### ఆడపిల్ల

ఆడపిల్ల పుట్టినప్పడే 'మైనస్' అన్న పెదవి విరుపులు
ఇవి ఏమీ తెలియని పసిపాప బోసినవ్వులు
యుక్త వయసు రాగానే మగపిల్లల మధ్యకెళ్ళొద్దని
తల్లి చీవాట్లు
చదివింది చాలులే ఆడపిల్లకు చదువెందుకని
తండ్రి అరుపులు
ఉద్యోగం చేసే ఆడవారి పట్ల
తోటివారి ఆకలిచూపులు
మగమహారాయుడిలా ఉద్యోగం చేస్తుందని
చుట్టుపక్కల వాళ్ళ సూటిపోటు మాటలు
అన్ని రంగాల్లో మగవాళ్ళతో
సమానంగా వున్నా
ఆడవాళ్ళకు తప్పలేదు ఈ బాధలు

...కవితా రచన
వైదా ఈశ్వరరావు
సెల్ నెం:7674942843

# పంచాంగం

మాసం : ధనుర్మాస; తిథి :షష్ఠి మ.12.38; రేవతి తె.4.52; సా.వ.4.52ల 6.28.

మంగళవారం 23-01-2018

**మేషం :** మీ సంతానం ఉన్నతి కోసం కొత్తకొత్త పథకాలు రూపొందిస్తారు. వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్సలు పూర్తి చేస్తారు.బంధువులను కలుసుకుంటారు. స్త్రీలకు షాపింగ్‌లోనూ, వాహనం నడుపుతున్న పుడు ఏకాగ్రత ముఖ్యం. రావలసిన ధనం వసూలు విషయంలో శ్రమాధి క్యత, ప్రయాస లెదుర్కొంటారు. నూతన పరిచయాలు, వాతావరణం సంతృప్తి నిస్తాయి.

**వృషభం :** బ్యాంకుల్లో మీ పనుల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కోవలసి వస్తుంది. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్లు కలిసివస్తాయి. ఇచ్చిపుచ్చుకునే వ్యవహా రాలు, ఒప్పందాల్లో మెలకువ వహించండి.

**మిధునం :** స్త్రీలకు, గృహ వాతావరణం, సంతానం వైఖరి వల్ల చికాకులు తప్పవు. కళాకారులకు, క్రీడాకారులకు మంచి గుర్తింపు రాణింపు లభిస్తుంది. పలుకుబడి కలిగిన వ్యక్తుల పరిచయం వల్ల పనులు అనుకూలిస్తాయి. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణం మంచిది కాదు.

**కర్కాటకం :**విదేశీ వస్తువుల పట్ల ఆకర్షితులవుతారు. ప్రముఖులను కలుసుకుంటారు. బంధువుల రాకతో గృహంలో సందడి నెలకొంటుంది. స్త్రీలలో ఒత్తిడి, హడావుడి అధికమవుతాయి.

**సింహం :** పోస్టల్, కొరియర్ రంగాల వారికి ఒత్తిడి, పనిభారం అధికమవుతుంది. నిరుద్యోగులకు సదావకాశాలు లభించిన సద్వినియోగం చేసుకోలేరు. ఉపాధ్యాయులకు పై అధికారుల నుంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. మీ కళత్ర మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది.

**కన్య :** కొంతమంది మీతో సన్నిహితంగా ఉంటూనే చాటుగా అపకారం తలపెట్టేందుకు యత్నిస్తారు. చిన్ననాటి మిత్రులను, ప్రియమైన వ్యక్తులను కలుసుకుంటారు. స్థిరాస్తిని కొనుగోలుచేయు యత్నాలు ఫలిస్తాయి. పనులు మొదట్లో మందగించినా క్రమేపీ పూర్తికాగలవు. కుటుంబీకులతో దైవ దర్శనాలు చేసుకోగలగుతారు.

**తుల :** కాంట్రాక్టర్లకు కార్మికులతో సఖ్యత నెలకొంటుంది. కుటుంబ సభ్యుల వైఖరిని సమీక్షించుకుంటారు. భాగస్వామి మాటతీరు, కదలికలను గమనించడం ఎంతైనా మంచిది. ఉద్యో గస్తులకు హోదాతో పాటు బరువు బాధ్యతలు పెరుగుతాయి.


**వృశ్చికం :** ఆర్థిక లావాదేవీలు, ఒప్పందాల్లో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. వృత్తిపరంగా ఎదుర్కొంటున్న ఆటంకాలు క్రమంగా తొలగిపోగలవు. ఒక్కోసారి మీ జీవిత భాగస్వామి మనస్తత్వం అర్థం చేసుకోవడం కష్టమవుతుంది. సభలు, సమా వేశాలల్లో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు.

**ధనుస్సు :** ఫ్యాన్సీ, స్టేషనరీ, రసాయన, సుగంధ ద్రవ్య వ్యాపారులకు శుభదాయకం. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి. ఆకస్మిక ఫీజులు, బిల్లులు చెల్లిస్తారు. పట్టుదలతో శ్రమించి అనుకున్నది సాధిస్తారు. సోదరీ, సోదరులతో ఉల్లాసంగా గడుపుతారు. కుటుంబీకుల ఆరోగ్యంలో మెళకువ అవసరం.

**మకరం :** ఆర్థిక కార్యకలాపాలు సానుకూలంగా సాగుతాయి. మీ సంతానం మొండివైఖరి వల్ల చికాకులు వంటివి ఎదుర్కొంటారు. ఫైనాన్స్ వ్యాపారస్తులకు ఖాతాదారుల నుంచి ఒత్తిడి పెరుగుతుంది. నిరుద్యోగులకు తాత్కాలిక అవకాశం లభిస్తుంది. పెద్దలతో కుటుంబ విషయాలు చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటారు.

**కుంభం :**కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటిపైనే శ్రద్ధ వహించండి. నిరుద్యోగులకు రాత, మౌఖిక పరీక్షల్లో ఏకాగ్రత ముఖ్యం. కుటుంబ విషయాల్లో స్త్రీలకు పట్టుదల, పంతాలు మంచిది కాదు. ఉపాధ్యాయు లకు పనిభారం అధిక మవుతుంది. ముఖ్యమైన వ్యవహారాలు గోప్యంగా ఉంచండి. స్త్రీలకు సన్నిహితుల నుండి అందిన ఆహ్వానాలు సంతృప్తినిస్తాయి.

**మీనం :** గృహంలో మార్పులు, చేర్పులు అనుకూలమైన కాలం. బ్యాంకు డిపాజిట్లు, దీర్ఘ కాలిక పెట్టుబడులకు అనుకూలం. పుణ్యక్షేత్రాల దర్శనం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుంది. కాంట్రాక్టర్లకు నూతన టెండర్ల విషయంలో పునరాలచోన అవసరం.



# రామాయణం: సీతాదేవి వ్యక్తిత్వం.. ప్రత్యేకతత

క్షమ..దయ...ధైర్యం...వివేకం...ఆత్మాభిమానం కలబోసిన ఉదాత్తమైన స్త్రీ పాత్ర సీత'. సతీ లేనిదే రామాయణం లేదు. సీత లేకుండా రాముని జీవితాన్ని అసలు ఊహించలేము. కాబట్టే రామాయణ ఇతిహాసంలో ఆమె పాత్రపై ఎందరో మహానుభావాలు మరియు మేథావులు పరిశోధనలు కూడా చేశారు. సీతలోని సుగుణాలు నేటి మగువలకు ఎంతో ఆదర్శం. ఆమె చరితం ఓ స్ఫూర్తిదాయకమైన కథాసాగరం. రామాయణంలో ఏ ఘట్టం తీసుకున్నా సీత గుణగుణాలు ప్రతి ఒక్కరికీ ఎంతో ఆదర్శప్రాయంగా నిలుస్తాయి... ధర్మమూర్తి: సీత ఒక ఇల్లాలిగా తన భర్త బాధ్యతలో, కర్తవ్య దీక్షలో తను కూడా పాలుపంచుకొని ఆదర్శ గృహిణిగా మారిన మహాసాధ్వి సీతాదేవీ'. రాముడు తండ్రికి ఇచ్చిన మాటకు కట్టుబడి అరణ్యవాసానికి వెళ్లినప్పుడు తన భర్త అడుగుజాడల్లో తనూ నడిచి, అతని కష్టసుఖాల్లో పాలు పంచుకోవడానికి సిద్ధమైన ధర్మపత్నిగా తన ధర్మాన్ని నిర్వర్తించింది. దయాశీలి: పేదవారిని ఆదరించి అన్నం పెట్టాలన్న దయాగుణం గల స్త్రీమూర్తి సీత. అదే భావనతో తనింటికి మారువేషంలో బిక్షాటన వచ్చిన రావణుడికి లక్ష్మణరేఖ దాటి మరీ భిక్షం వేసిన దయామూర్తి ఆమె. తన రక్షణ కోసం పెట్టుకున్న నియమం కన్నా దానమే గొప్పదన్న నీతిని ఆమె ఈ సందర్భంలో వెల్లడిస్తున్నది. ధైర్యశాలి: పాతివ్రత్య నిరూపణ కోసం సీతను అగ్నిప్రవేశం చేయమని రాముడు అడిగినప్పుడు ధీరత్వంతో ఆ పనికి సిద్ధమైన ధైర్యశాలి సీత. రాముని మాటలు ఆమె గుండెను గాయపరిచినా సహనంతో భరించింది. తానే తప్పు చేయలేదన్న ఆమె ఆత్మవిశ్వాసం చివరికి నిందారోపణ చేసిన వారిని సైతం తలదించుకునేలా చేసింది. అభిమానవతి: సీతకు ఆత్మాభిమానం ఎక్కువ. చిత్రకూటానికి సీతారాములు వచ్చారని తెలిసి, ఆమె తండ్రి జనకుడు వారిని కలిసి వనవాసం పూర్తయ్యేదాకా మిథిలానగరానికి వచ్చి తనతో పాటు ఉండమని కోరినప్పుడు, ఆ మాటలను సున్నితంగా తిరస్కరించిన ఆత్మాభిమాని సీత. మెట్టినింటికొచ్చాక ఎన్ని విషమ పరిస్థితులెదురైనప్పటికీ తమే పరిష్కరించుకోవాలి గానీ, పుట్టింటి వారిని ఇబ్బంది పెట్టకూడదన్న అభిమానవతి సీత. జంతు ప్రేమికురాలు: ప్రకృతి మీద, పశుపక్ష్యాదుల మీద ఎనలేని ప్రేమ కలిగిన స్త్రీమూర్తి సీత. అదే ప్రేమతో అందమైన జింకను తన కోసం తీసుకురమ్మని భర్తను అభ్యర్థిస్తుంది సీత. వివేకవంతురాలు: రావణాసురుడు తనను అపహరించి తీసుకెళ్లిపోతున్నప్పుడు, రాముడికి తన ఆనవాళ్లు చిక్కడం కోసం బంగారునగలను నేల మీద జారవిడిచిన వివేకవంతురాలు సీత. ప్రేమమూర్తి: సీతకు రామునిపై ఎంతటి ప్రేమానురాగాలంటే..ఆ ప్రేమలో తనను తానే మైమరిచిపోయేది. రావణుడి చెరలో బందీగా ఉండి కూడా నిత్యం శ్రీరామనామస్మరణ చేస్తూ అనుక్షణం పతి క్షేమాన్ని కోరేది. చైతన్యశీలి: సీత ఎంత చైతన్యశీలి అంటే అపాయంలో కూడా భయంతో ఆమె శత్రువులకు లొంగలేదు. రావణడు సీతను బెదిరించి, తన వశం కావాలని ఆదేశించినప్పుడు, ఒక గడ్డిపరకను అడ్డంగా పెట్టుకొని నువ్వు నాకు దీనితో సమానం అని చెప్పకనే చెప్పి అతని ధర్మహీనతను ప్రశ్నించిన ప్రజావంతురాలామె. క్షమాగుణం: రాక్షస సంహారం తర్వాత సీతను అవోకవనం నుంచి విడిపించి తీసుకువెళ్తున్న సమయంలో, తను బందీగా ఉన్నప్పుడు ఆ వనంలో తనను మాటలతో హింసించిన రాక్షసులకు ఏ కీడు తలపెట్టవద్దని, వారు స్వామిభక్తితో తమ బాధ్యతను మాత్రమే నిర్వర్తించారని హనుమంతునితో చెప్పిన క్షమాగుణం సీత సొంతం. ఆదర్శమూర్తి: అడవిలో ఆశ్రమవాసిగా కాలం గడుపుతూ కూడా తన కుమారులను ప్రయోజకుల్ని చేయాలని ఎల్లవేళలా తపిస్తూ, వారిని కార్యసాధకులుగా తీర్చిదిద్దడం ఆమె ఉత్తమ పెంపకానికి నిదర్శనం.

## సంకీర్తన




# స్వచ్ఛతలో మరో ఘనత

**- జాతీయ స్థాయిలో జిల్లాకు 11వ స్థానం**

**- రాష్ట్రంలో రెండో స్థానం - 80.68 శాతం మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి**

విజయనగరం: స్వచ్ఛ విజయనగరం సాధనలో జిల్లా మరో ఘనత సాధించింది. జాతీయ స్థాయిలో నాన్ ఓ.డి.ఎఫ్. జిల్లాల్లో యీ కార్యక్రమం అమలులో తాజాగా 11వ ర్యాంకు సాధించడంతో పాటు రాష్ట్రంలో రెండో ర్యాంకులో నిలిచింది. జిల్లాను బహిరంగ మల విసర్జన రహిత జిల్లాగా రూపొందించడంలో భాగంగా జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ నేతృత్వంలో పెద్ద ఎత్తున మరుగుదొడ్ల నిర్మా ణాలు జరుగుతున్న విషయం తెలిసిందే. స్వచ్ఛభారత్ మిషన్ ఇటీవల తాజాగా వివిధ జిల్లాల ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. 80.68 శాతం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తిచేసి దేశంలో 11వ జిల్లాగా నిలిచింది. ఈ ఏడాది ఫిబ్రవరి 15వ తేదీ నాటికి బహిరంగ మలవిసర్జన రహితంగా తీర్చిదిద్దేందుకు జరుగు తున్న ప్రయత్నంలో ఇప్పటికే 3.44 లక్షలకు పైగా మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. జిల్లాలో 4,26,948 మరుగుదొడ్లు నిర్మించాల్సి వుండగా మిగిలినవి వచ్చే 25 రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసేందుకు జిల్లా యంత్రాంగం ముమ్మరంగా కసరత్తు చేస్తోంది.

# అంగన్వాడీలను కార్మికులుగా గుర్తించాలి

## అంగన్వాడీ అసోసియేషన్ అధ్యక్షులు అప్పలరాజు



నర్సీపట్నం : రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాలు పిలుపు మేరకు అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు కేంద్రాలు మూసేసి ఆందోళనలో పాల్గొని విజయవంతం చేయాలని అంగన్వాడీ అసోసియేషన్(ఏఐటియుసి) జిల్లా అధ్యక్షులు ఎం.అప్పలరాజు కోరారు. రూ.18వేలు కనీసం వేతనం, కార్మికులుగా గుర్తింపు ఇవ్వాలనే ప్రధాన డిమాండ్లతో ఆందోళనకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. రూ.4600 టీచర్‌కి, రూ.3200 ఆయాకి గత నెలలో జీతాలు జమ చేసిన విషయమై అధికారులు స్పష్టత ఇవ్వాలన్నారు. 2015 నుంచి గ్యాస్ సబ్సిడి విడుదల చేయలేదనాన్రు. ఇంటి అద్దెలు చెల్లించకపోవడం సెంటర్లకి ఇంటి యాజమానులు తాళాలు వేసిన సంగతి అధికారులు మర్చిపోలేకపోయినా అద్దెలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఒక్కో గ్యాస్ బండ రూ.800కి కొనుగోలు చేస్తుంటే ప్రభుత్వం కేవలం రూ.400 మినీ కేంద్రాలకు రూ.125 చెల్లించడం అన్యాయమన్నారు. రెండు సంవత్సరాలుగా లింకు వర్కర్లకి వేతనాలు ఇవ్వకపోగా నోటీసు తొలగించడం వల్ల అంగన్వాడీలకు ఉద్యోగ భద్రతపై కార్మికులుగా గుర్తించాలని కోరుతున్నామన్నారు. ఇకనైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కళ్ళు తెరచి బడ్జెట్ కేటాయింపులు తగు రీతిలో చేయాలని చేస్తున్న సమ్మెను విజయవంతం చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు జ్యోతి, వరహాలమ్మ, సత్యవతి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి గుర్తింపునకు అధ్యయనం

విజయనగరం: గజపతినగరం వ్యవసాయ మార్కెట్ కమిటీని జాతీయస్థాయి మార్కెట్ కమిటీగా గుర్తించేందుకు ఉన్న వనరులు, వసతులపై కేంద్రబృందం అధ్యయనం చేసింది. ఇటీవల విశాఖలో జరిగిన జాతీయ వ్యవసాయ సమ్మేళనంలో వ్యవసాయాభివ ృద్ధికి, మార్కెటింగ్ సదుపాయాల కల్పనకు కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర?యం మేరకు ఈ అధ్యయనం జరుగుతున్నట్లు బ ృందసభ్యులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో గజపతినగరం వ్యవసాయ మార్కెట్ కమిటీతో పాటు దుగ్గిరాల, ఆదోని, గుంటూరు, రావులపాలెం, అనకాపల్లి, మార్టేరు, మదనపల్లె, కుప్పం, ఏలూరు, నందిగామ, హిందూపురం మార్కెట్ కమిటీలపై అధ్యయనం జరుగుతుందని బ ృందసభ్యులు గౌతమ్, ఫరీద్, విశాల్, అపూర్వ తెలిపారు. వీరంతా గురుగావ్‌కు చెందిన కేపీఎంజీ సంస్థకు చెందిన సహాయ ప్రబంధకులు. తమకు కేంద్ర వ్యవసాయశాఖ కమిషనర్ ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న కమిటీలపై అధ్యయనం జరపాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. తమ నివేదికలు కమిషనర్‌కు అందజేస్తామన్నారు. శుక్రవారం ఉదయం 5 గంటలకు గజపతినగరం మార్కెట్ కమిటీకి చేరుకున్నారు. ఉదయాన్నే కూరగాయలు తీసుకువచ్చే రైతులతో అంగడి జరిగే విధానం, వారికి ప్రయోజనాలు, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్ కమిటీకి ఉన్న భూమి, గిడ్డంగులు, ఇతర వసతుల వివరాలు తెలుసుకున్నారు. మధ్యాహ్నం మామిడి రైతులతో మాట్లాడారు. మార్కెట్ సదుపాయాలు, ఎలాంటి సౌకర్యాలను ఏర్పాటు చేయాలనే అంశాలను అడిగారు. జాతీయస్థాయి మార్కెటింగ్‌కు అవసరమైన పంటల అందుబాటు, వాటికి జిల్లాలో ఉన్న అంగడి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ అధికారుల బ ృందానికి గజపతినగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బుద్ధరాజు నరసింహవర్మ, కార్యదర్శి అరుణకుమారి వివరాలు తెలియజేశారు.

# సమస్యలుంటే గ్రీవెన్స్‌లో తెలియజేయాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఒ

నర్సీపట్నం: సమస్యలుంటే గ్రీవెన్స్‌లో తెలియజేయాలని నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయ పరిపాలానాధికారి(ఏఒ) వానపల్లి ప్రకాశరావు అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో గ్రీవెన్స్‌లో ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. పింఛన్లు, ఇళ్ల స్థలాలు, స్థల ఆక్రమణ తదితర విషయాలపై పలు గ్రామాల నుంచి ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా ఏఒ మాట్లాడుతూ సమస్యలు గ్రీవెన్స్‌లో తెలియజేస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

# కెరియర్ ప్లస్ ఇ మేగ్జయిన్ విడుదల



కెరియర్ ప్లస్ ఇ మేగ్జయిన్‌ను విడుదల చేస్తున్న వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు

ఏయూ : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ గయిడెన్స్ బ్యూరో తీర్చిదిద్దిన కెరియర్ ప్లస్ ఇ మేగ్జయిన్‌ను ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు సోమవారం మద్యాహ్నం విడుదల చేశారు. విద్యార్థులకు ఉపాధికి ఉపయుక్తమైన సమాచారాన్ని అందించే విధంగా ఇ మేగ్జయిన్ నిలుస్తుందన్నారు.

యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో చీఫ్ ఆచార్య వై.అబ్బులు మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం, కెరియర్ సంబంధించిన అంశాలు, ఉన్నత విద్య, స్కాలర్‌షిప్‌లు, ఉద్యోగ అవకాశాలు వంటివి దీనిలో పొందుపరిచారు. విద్యావంతులైన యువత ఉపాధికి అనుగుణంగా సిద్ధం కావడా నికి అనువుగా ఉపయోగపడు తుందన్నారు.. త్రైమాసికంగా తీర్చిదిద్దే కెరియన్ ప్లస్ ఇ మేగ్జయిన్ కళాశాలలకు అందించడం జరుగు తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎంప్లా యిమెంగ్ ఎక్సేంజీలకు సైతం ఈ సమాచారం అందించడం జరుగుతుందన్నారు. కార్య క్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎస్ అవధాని, డిప్యూటి చీఫ్ టి.అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మెడ్‌ఆల్త్ డయాగ్నోస్టిక్స్ 3వ బ్రాంచ్

## మంత్రి గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రారంభం



విశాఖపట్నం: ఆధునిక వైద్య పరికరాలతో మెరుగైన సేవలు అందించాలని విశాఖ నగర వాసులకు మెడాల్ డయాగ్నోస్టిక్స్ నూతన సెంటర్‌ను కలెక్టర్ ఆఫీస్ ఎదురుగా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాజెక్టును గత 10 సంవత్సరాలుగా సేవలు అందిస్తూ ప్రభుత్వ మన్ననలను పొందిన సంస్థ. అత్యంత నూతన టెక్నాలజీతో ఈ కొత్త డయాగ్నోస్టిక్స్ సెంటర్‌ను ప్రారంభించి, 20శాతం తక్కువ ఖర్చులతో మెరుగైన సేవలకు ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ విశిష్ట అతిథిగా హాజరై ఎక్స్‌రే విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిటీ ఆఫ్ డిస్టీ, స్మార్ట్ సిటీ విశాఖలో ఇటువంటి అధునాతన సెంటర్‌లు రావడం ఇక్కడ ప్రజలకే కాకుండా ఉత్తరాంధ్ర వారికి ఉపయోగపడు తుందన్నారు. సెంటర్ జనరల్ మేనేజర్ పవన్.జె మాట్లాడుతూ సుమారుగా 27కోట్ల రూపాయిలతో అత్యంత అధునాతనమైన ఎంఆర్ఐ, సిటీ, ఆల్ట్రా సౌండ్ రక్తపరీక్షల పరికరాలు ఈ సెంటర్‌లో వున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వియస్‌పి.రమేష్, ఏలాంకీ, మేనేజర్స్, కెజిహెచ్ సూపరింటెండెంట్ జి.అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే నెల 18 నుంచి

# కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర

విజయనగరం: ఎస్‌హెచ్‌జీల పటిష'తకు పైలెట్ ప్రాజెక్టుగా విజయనగరం ఎంపిక : ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్య దైవం, కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పూజలందుకుంటున్న చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర ఫిబ్రవరి 18 నుంచి మూడు రోజుల పాటు జరగనుంది. ప్రతి ఏటా శివరాత్రి తరువాత వచ్చే ఆది, సోమ, మంగళవారాల్లో జాతర నిర్వహిస్తారు. ఈసారి అదే ఆనవాయితీని కొనసాగిస్తూ భారీఎత్తున జాతర నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, దేవాదాయశాఖ అధికారులు నిర్ణయించారు. చీపురుపల్లి పట్టణ శివారున కనకమహాలక్ష్మి దేవస్థానం ఉంది. ప్రతి సంవత్సరం వైభవంగా నిర్వహించే అమ్మవారి ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి నాలుగు లక్షలకు పైగా భక్తులు హాజరవుతుంటారు. లక్షలాదిగా తరలివస్తున్నందున విశాలమైన పంట పొలాల్లో జాతర నిర్వహిస్తూ వస్తున్నారు. మూడు రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున సాంస్క ృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తుంటారు. ఈ ఏడాది కూడా ఇదే తరహాలో వైభవంగా అమ్మవారి ఉత్సవాలు నిర్వహించడానికి ప్రజాప్రతినిధులు కరసత్తు చేస్తున్నారు. దీనికి సంబంధించి సన్నాహక సమావేశం త్వరలో జరగనుంది.

# ఈనెల 24 న

# శ్రీ అక్కలమ్మ పేరంటాల తీర్థం

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి పంచాయితీ శివారు రావలమ్మపాలెం గ్రామంలో ఈనెల 24న బుధవారం శ్రీ అక్కలమ్మ పేరంటాల తీర్థం మహోత్సవం జరుగునని మాజీ సర్పంచ్ జక్కాన ముత్యం విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24న బుధవారం ఉదయం 6 గంటల నుండి ధూప, దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు పేరంటాలు నిర్వహించబడును.

# అప్పన్న హుండీ ఆదాయం

## *73 లక్షల 72 వేల 086 రూపాయలు*



సింహాచలం శ్రీవరహాలక్ష్మీనరసింహ స్వామి వారి హుండీల లెక్కింపు కార్యక్రమం సింహగిరి పై జరిగినది భక్తులు వివిద కానుకలరూపంలో సమర్పించి న కానుకలు 20 రోజులకు గాను బంగారము 0 .127 .600 గ్రాములు వెండి 6 .300 .000 గ్రాములు మరియు కరెన్సీ నోట్లు చిల్లర నాణెములు రూపములో 73,72 ,086 /రూపాయలు భక్తులు సమర్పించారు . హుండీ లెక్కింపు కార్యక్రమం ఈ ఓ కె .రామచంద్రమోహన్ గారు మరియు పి ఆర్ ఓ జై ముని గారు ఏ ఈ ఓ లూ కృష్ణమాచార్యులు ,వై శ్రీనివసరావు పర్యవేక్షణలో జరిగింది .

ఈ కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు , భక్తులు మొదలగు వారు పాల్గొన్నారు .

# సామాజిక మరుగుదొడ్లు ప్రారంభం

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీలో సామాజిక మరుగుదొడ్లు ప్రజలకు అందుబాటులో వచ్చాయి. పట్టణంలోని ఇండోర్ స్టేడియం సమీపంలో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. ఇక్కడే క్రీడా ప్రాంగణం, రెండు కోర్టులు ఉండటం వల్ల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని మున్సిపల్ కమిషనర్ వేగి సత్యనారాయణ తెలిపారు. ఈ సామూహిక మరుగుదొడ్లు అందుబాటులో రావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# అంతటా అమ్మకు వందనం



అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు మొక్కులు



గొలుగొండ మండలం చీడిగుమ్మల గ్రామంలో పాదాభివందనం

నర్సీపట్నం : ప్రభుత్వాదేశాల ప్రకారం అధికారులు, అమ్మకు వందనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కేజీబివి తదితర ప్రదేశాలలో తల్లుల నుండి పిల్లల ఆశీర్వాదాలు పొందారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గన్నారు. అంతటా అమ్మకు వందనం కార్యక్రమం చేపట్టారు.




వేములపూడి కేజీబివిలో అమ్మకు పాదాబివందనం



సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఆచారాలు ప్రకారం జరిపిన దృశ్యం

## *20 మంది సీఆర్‌పీల ఎంపికకు 23న రాత, మౌఖిక పరీక్షలు : మెప్మా పీడీ*

విజయనగరం : పట్టణంలో స్వయం సహాయక సంఘాల పనితీరు మెరుగుపరచడానికి, సంస్థాగత నిర్మాణం పూర్తిస్థాయిలో పటిష్ట పరచడానికి సీఆర్పీలను ప్రతిపాదించినట్లు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) పథక సంచాలకులు ఎం.లక్ష్మునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమ అమలుకు విజయనగరాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. సీఆర్పీలు నెలకు గరిష'ంగా 21 రోజులు పని చేయాలని, పని దినాలకు రూ.200 రిసోర్స్ ఫీజు చెల్లిస్తారన్నారు. వీరి సేవలను గరిష'ంగా ఆరు నెలలు మాత్రమే ఉపయోగిస్తారన్నారు. అర్హతలు: పట్టణ ప్రాంతంలోని సంఘ సభ్యురాలై ఉండాలని, సీబీఐ నిర్వహణలో కనీసం ఐదేళ్ల అనుభవం, ఏదైనా ఇంటర్మీడియట్ అర్హత కలిగి ఉండాలన్నారు. సీబీఐ నిర్వహణలో మూడేళ్ల అనుభవం, ఏదైనా డిగ్రీ అర్హత ఉన్నవారు, కంప్యూటరు పరిజ్ఞానం, మెప్మా, ఎన్‌యూఎల్‌ఎం పథకాలపై అవగాహన కలిగిన వారు అర్హులన్నారు. ఎంపిక విధానం: ఈనెల 23న కణపాక యూత్ హాస్టల్‌లో రాత పరీక్ష, మధ్యాహ్నం 2 గంటల నుంచి మౌఖిక పరీక్ష ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 97013 85775 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

# మొదలైన భక్తాంజనేయ స్వామి ఉత్సవాలు

రావికమతం: రావికమతం మండలం మేడివాడలో శ్రీ భక్తాంజనేయ స్వామి ఉత్సవాలు వైభవంగా మొదలయ్యాయి. ప్రతీ ఏటా రథ సప్తమినాడు మహా ఉత్సవం చేస్తుంటారు. ఈ ఉత్సవం 22, 23, 24 తేదీల్లో చేస్తుంటారు. ఉత్సవం సందర్భంగా గ్రామంలో రెండు కిలో మీటర్ల మేర భారీ విద్యుత్ అలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 24న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. దీంతో పాటు భారీ అన్నసమారాధాన కార్యక్రమం అదే రోజు జరుగుతుందని, అనంతరం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు.

**DISTANCE EDUCATION**
**B.a., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., All Groups**
**GRACE ACADEMY**
SBI మేడపైన - సబ్బవరం
**77806 64414, 99666 99633**

**DSC + TET**
**SGT - & S A Social Group IV & Group VRO - VRA**
క్లాసులు ప్రారంభమయినవి
**GRACE ACADEMY**
SBI మేడపైన - సబ్బవరం
**77806 64414, 99666 99633**

**గౌరవ 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు**
**విశాఖపట్నం**
**క్రిమినల్ అపీలు నెం.322/2017**

**కాళ్ళ ప్రసాదు,**
**తండ్రి కాళ్ళ వెంకటరావు,**
**డోర్.నెం.1-9-1, కొత్త వెంకోజిపాలెం,**
**విశాఖపట్నం-17.** ...అప్పీలెంటు
**మరియు**
**మహమ్మద్ ఇంతియజ్ అహమ్మద్,**
**తండ్రి లేటు ఎమ్.హెచ్.ఖాన్,**
**డోర్.నెం.44-38-12/20/18**
**80 ఫీట్ రోడ్డు, అక్కయ్యపాలెం,**
**విశాఖపట్నం-16.** ...రెస్పాడెంట్/కంప్లయినెంట్

**నోటీసు**

నా క్లయింట్ అయిన కాళ్ళ ప్రసాదు రెండవ అదనపు జిల్లా జడ్జివారి కోర్టులో 5వ స్పెషల్ మేజిస్ట్రేట్, విశాఖపట్నం వారి యొక్క తీర్పునకు అప్పీలు దాఖలు చేసినారు. సదరు అపీలు నెం.322/2017 అయి ఉన్నది. సదరు కేసు వాయిదా **తే.15-02-2018** అయి ఉంది. గావున మీరు ఆ తేదీ నాడు మీరు గాని మీ తరపు వకీలు గాని, పై తెలిపిన గౌ॥ రెండవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో **ఉదయం 10.30 గం॥లకు** హాజరు కావలసిందిగా తెలియజేయుచున్నాను.

ఇట్లు
ఎం.ఎస్.ఎస్.ప్రభాకర్‌రెడ్డి
అడ్వకేట్,
విశాఖపట్నం.

తేది: 22-01-2018
విశాఖపట్నం.

# సేంద్రియ ఎరువులు సద్వినియోగం చేసుకోవాలి



యానాం : మున్సిపాలిటీ ద్వారా డంపింగ్ చేస్తున్న వ్యర్థాల నుండి సేంద్రియ ఎరువులు వినియోగించుకొని లబ్ధిపొందాలని పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు అన్నారు. స్థానిక చిల్డ్రన్ ఆడిటోరియంలో మున్సిపాలిటీ ఏర్పాటుచేసిన వివిధ రకాల వ్యర్థాల పునర్ వినియోగంపై జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతిరోజు పట్టణ ప్రాంతంలో పారిశుద్ధ్య కార్మికులు డంపింగ్‌లో వేస్తున్న వ్యర్థాలను ఒక గోతులో కప్పి 45 రోజుల అనంతరం సేంద్రియ ఎరువుల క్రింది ఉపయోగపడతాయని చనిపోయిన జంతువుల కళేబారాల నుండి సమృద్ధి ఎరువులు తయారవుతున్నాయని వాటివలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని పుదుచ్చేరి నుండి వచ్చిన నిపుణుల బృందం ఇచ్చిన సలహాలు, సూచనలు ప్రతిఒక్కరూ పాటించాలని ఆయన కోరారు. పనికిరానిది ఏదీ లేదని ప్రతివస్తువు వలన ఉపయోగం ఉన్నదన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. అవగాహన లేనివారు సంబంధితులను అడిగి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ జి. గౌరీ సరోజిని , డాక్టర్ గోల్డా, నందివర్మన్, డాక్టర్ సతీష్‌కుమార్ తదితరులు ప్రసంగించారు.

# కనకాలపేటలో విద్యార్థులు ఇంటింట ప్రచారం



యానాం : బేటీబచావో, బేటీ పడావో కార్యక్రమంపై విద్యార్థులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సోమవారం ఉదయం కనకాల పేట, రామాలయం, ఆదిఆంధ్రపేట, మత్స్యకార పేట, జంబుపడవ, తదితర ప్రాంతాలలో విద్యార్థులు ఆడపిల్లలను చదివించండి, బాల్య వివాహాలను నివారించండి, పరిశుభ్రత పాటించండి, మొక్కలు పెంచడంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తు కరపత్రాలద్వారా ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. సాంఘిక సంక్షేమశాఖ అధికారి చింతారామజోగి, చైల్డ్‌లైన్ ప్రతినిధి వి. శ్రీనివాసరావు, ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు, డ్వాక్రా గ్రూప్ మహిళలు, మహిళా సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా రెడ్డివారి తీర్ధం

## హజరైన ఎమ్మెల్యే బండారు, జడ్పిటిసి పైల



పరవాడ : మండల కేంద్రమైన పరవాడలో గలరెడ్డివారి గుండాలమ్మ తీర్ధం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు వేకువజాము నుండే అలయంవద్దకు చేరుకుని పూజలు నిర్వహించారు. పెందుర్తి శాసన సభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, జిల్లా ప్రాదేశిక సభ్యులు పైల జగన్నాధరావు, అహారభద్రత సలహమండలి సభ్యులు పైల సన్యాశిరాజు, పెందుర్తి నియోజకవర్గ తెలుగుదేశం పారి ఇన్‌చార్జ బండారు అప్పలనాయుడు, జన్మ భూమి కమిటి మెంబర్ రెడ్డి శ్రీనువాసురావు, పరవాడ మండల ప్రదాన కార్యదర్శి పైల రామచంద్రరావు, పైల సన్యాశిరావు మాష్టర్, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం జరిగిన అన్న సమారాధనకు భారీస్పందన లభించింది. ఈ అన్నసమారాధనకు గ్రామం నలు మూలలు నుంచి వెయ్యిమందికి పైగాభక్తులు ఈ అన్నసమారాధనలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. అనంతరము సాయంత్రము కొలాటములు, చిటికలు భజనలు ప్రజలును ఎంతగానో అకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రెడ్డిఎర్నియుడు, రాజాన సత్యం, రెడ్డిచిన్నా, రెడ్డినాగేశ్వరావు, రెడ్డి వెంకటరావు, వగ్రిహరి, పైల అక్కునాయుడు, రెడ్డివారి కుటుంబ సభ్యులు మరియు అధికసంఖ్యలో ప్రజలు పాల్గోన్నారు.

## హిందూ ఆత్మగౌరవ సభకు తరలిరావాలి

తాళ్లరేవు : స్వామీ పరిపూర్ణానంద కాకినాడలో ఈ నెల 28న నిర్వహించే ఆత్మగౌరవ సభకు పెద్దఎత్తున హిందువులు తరలిరావాలని స్వామి వివేకనంద యూత్ ప్రతినిధులు కోరారు. తాళ్లరేవు సంతపేటలో యూత్‌ప్రతినిధులు పి. శ్రీకృష్ణ, చెక్కా అజయ్, వి.కర్మిల్ల స్వామి ఆద్వర్యంలో సభా పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాకినాడ జెఎన్‌టియు. ఎదురుగా ఉన్న ఎగ్జిబిషన్ మైదానంలో హిందూ దర్మాన్ని కాపాడటంకోసం స్వామీ పరిపూర్ణనంద చేస్తున్న ప్రయత్నానికి మద్దతుగా అంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చినపోతు అన్నవరం, పోలేటి నరసింహస్వామి, ఎం. వెంకట వర్మ, పి. వీరబాబు, కె. యువ, మణికంఠ స్వామి, సంజయే, తదితరులు పాల్గొన్నారు.

# అన్నవరంలో నీటి కష్టాలు

అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న 9, 10వ వార్డులలో గడిచిన 20 రోజులుగా నీరు రాకపోవడంతో వార్డులోని మహిళలు చాలా ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. దీనితో కనీస అవసరాలకు కూడా పంచాయతీ కుళాయిల ద్వారా గత కొద్ది రోజులుగా నీరు రాకపోవడంతో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. దీంతో మహిళలు స్దానికంగా ఉన్న వైసిపి నేతల దృష్టికి తీసుకు రావడంతో దీనితో వైసిపి టౌన్ ప్రెసిడెంట్ రాయవరపు. భాస్కరరావు, సరమర్ల.మధుబాబు, సింగంపల్లి.రాము, రాయి .శ్రీనివాస్‌ల దృష్టికి నీటి సమస్యను చెప్పుకొని కనీసం పండగపూట కూడా చెంబుడు నీళ్లు రాలేదని వాపోయారు. అయితే స్దానిక మహిళలు తరుపున వైయస్‌ఆర్ సిపి నాయకుడు సరమర్ల. మధుబాబు మాట్లాడుతూ ఈ నీటి సమస్యను పంచాయతీ పరిష్కరించకపోతే శంఖవరంలో జరుగు గ్రీవెన్సుకు మహిళలతో స్దంబింపచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సమస్యను ఎదుర్కొంటున్న స్దానిక వార్డు మహిళలు, స్దానికులు కోళ్ళ. రమాదేవి, రంగాల.లక్ష్మి, కోళ్ళ.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 2 న సత్యదేవుని హుండీల లెక్కింపు

అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి హుండీల లెక్కింపు వచ్చేనెల ఫిబ్రవరి 2 వ తారీఖున ఉదయం 7-30 ని.లకు లెక్కించుటకు సదరు సొమ్మును బ్యాంకులో జమచేయుటకు నిర్ణయించినారు. కావున భక్తులకు గ్రామస్థులకు కార్యనిర్వహణాధికారి ఉత్తర్వులు మేరకు తెలియజేయడమైనది.

## జిల్లా స్థాయి చదరంగంలో బహుమతులు అందుకున్న "ఆలమూరు చిన్నారులు"

ఆలమూరు : రాజమహేంద్రవరం డిస్ట్రిక్ట్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో 7 సం॥లు బాలికల విభాగంలో నిర్వహించిన చదరంగం పోటీలలో ఆలమూరు సిద్ధార్ధ హైస్కూల్‌లో చదువుతున్న జి.ఆత్రేయకు మొదటి బహుమతి, పి.సాయిలిఖితకు ద్వితీయ బహుమతులు లభించాయి. ఈ బాలికలకు జి.రామ్ ప్రసాద్‌కు కోచ్‌గా వ్యవహరించారు.

## గృహనిర్మాణ లబ్ధిదారులు ఎంపికకు గ్రామ సభలు

ఆలమూరు : మండలంలో మంజూరు ఉత్తర్వులు లేకుండా ఇల్లు నిర్మాణం చేసుకున్న లబ్దిదారుల ఎంపికకు ఈ నెల 23 నుండి 25వరకు గ్రామసభలు ఏర్పాటుచేసినట్లు ఎంపిడిఓ నాతి బుజ్జి, హౌసింగ్ ఏఈ ఎస్.జేజిబాబులు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వారు స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు రెండు టీమ్‌లను ఏర్పాటుచేసి ఆయా గ్రామపంచాయితీ కార్యాలయాలలో ఈ గ్రామ సభలు నిర్వహించబడుచున్నట్లు వారు తెలిపారు. ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటల నుండి సంధిపూడి, పినపళ్ల, పెదపళ్ల, గుమ్మిలేరు, మోదుకూరు, నర్సిపూడిలలోను, 24న సూర్యారావు పేట, చింతలూరు, ఆలమూరు, మడికి, బడుగువానిలంక, చెముడులంక గ్రామాలలోను, 25న నవాబుపేట, పెనికేరు, కలవచర్ల, మూలస్థాన అగ్రహారం, చొప్పెల్ల, జొన్నాడ గ్రామాలలో నిర్వహించుచున్నట్లు వారు వివరించారు. లబ్దిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా కోరారు.

## ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం

రావులపాలెం : స్థానిక ఎమ్‌పిడిఓ కార్యాలయంలో సోమవారం ఎమ్‌పిపి కోట చెల్లయ్య అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశమునకు ముఖ్య అతిథిగా శాసన సభ్యులు చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఊబలంకలో ధోబీ ఘాట్ శంఖుస్థాపన చేసినా నేటివరకు పనులు ప్రారంభించక పోవడంపై గ్రామ రజకులు ఇచ్చిన విన్నపము మేరకు తక్షణం పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతిపక్షనేత కుడిపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ మండల పరిధిలో ఇసుక ర్యాంపుతో వచ్చిన ఆదాయ వివరాలు అడిగి ఆ నిల్వాలు గ్రామాభివృద్ధికి వినియోగించాలని కోరారు. ఎమ్‌పిపి కోట చెల్లయ్య మాట్లాడుతూ ర్యాంపుల ద్వారా సమకూర్చిన ఆదాయాన్ని మండల పరిషత్‌కు ట్రాన్స్‌ఫర్ చేస్తే మండలంలోని రోడ్లు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చిస్తామన్న విషయంపై తహశీల్దారు పై అధికారుల దృష్టికి తీసుకెళ్ళి నిర్ణయం తీసుకుంటామన్నారు.

# పూర్వవిద్యార్థుల సమ్మేళనం




యానాం : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వం ఆర్ట్స్ కళాశాలలో బికాం., చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు 1987 - 90 సంవత్సరాల మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థులు అలనాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ రోజంతా ముచ్చటించారు. ఇతర పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. పూర్వ విద్యార్థులు అంతా తమ కుటుంబ సభ్యులతో కలసి కార్యక్రమంలో పాల్గొన్నారు. సింగపూర్‌లో స్థిరపడిన సుబ్బారెడ్డి, కళాశాల అభివృద్ధికి రూ. 50 వేలు విరాళాన్ని ప్రకటించారు. విశాఖపట్నం డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న పూర్వ విద్యార్థిని డి. పుష్పమణి విశాఖపట్నంలో కార్పొరేట్ విద్యాసంస్థ ప్రిన్సిపల్‌గా వ్యవహరిస్తున్న సిహెచ్. శ్రీశాంతిలను సహచరులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో కనకాల శ్రీనివాసు, కె. రామకృష్ణ, కె. శ్రీనివాసు, కృష్ణమూర్తిరాజు, ఎల్ ప్రభాకర్, పి. నాగలక్ష్మి, టి. సుజాత, జాస్మిన్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

### కుటుంబ వ్యవస్థకు పునాది అయిన

# అమ్మను ప్రతీ ఒక్కరూ గౌరవించాలి

## వెలగలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అమ్మకు వందనం మంత్రి దేవినేని ఉమ



జి.కొండూరు: చదువుల తల్లి సరస్వతీ దేవి పుట్టినరోజు వసంత పంచమిని పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మకు వందనం అనే కార్యక్రమానికి తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు. జి.కొండూరు మండలం వెలగలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమ్మకు వందనం కార్యక్రమాన్ని మంత్రి ఉమా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అమ్మలు గౌరవించే వారే మన కుటుంబ వ్యవస్థ శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లుతుం దని ఏలాంటి సందేహం లేదని అన్నారు. కుటుంబ వ్యవస్థకు పునాది అయిన అమ్మను ప్రతి ఒక్కరూ గౌరవించాలని పిల్లలకు చిన్నతనంలోనే బోధించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది అన్నారు. నేటి తరానికి ముఖ్యంగా పాఠశాల విద్యార్థులను ఉద్దేశించిన కార్యక్రమం అమ్మకు వందనం... పాఠశాలలకు తల్లిని గౌరవంగా తీసుకువచ్చి ఆమె కాళ్లు కడిగించటం అంటే పెద్దలను గౌరవించే సంస్కృతి భోధించడమే ఈ కార్యక్రమ విశేషం అని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులను ఆరోజు పాఠశాలలకు ఆహ్వానించి విద్యార్థులకు ఆశీర్వాదం అంద జేసే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నా మన్నారు. రాష్ట్రంలోని 5 వేల ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నామన్నారు. ఇందు కు గాను ఒక్కో పాఠశాల కు రూ.2500 చొప్పున ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. అలాగే ఈ కార్యక్రమం కోసం ప్రత్యేక ప్రతిజ్ఞను రూపొందిం చామన్నారు. వివిధ పాఠశాలలకు చెందిన దాదాపు 15 లక్షల మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాలు పంచుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



విశాఖసిటీ షెడ్యూల్డ్ కులాల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గంట్యాడ శంకరరావు ఆధ్వర్యంలో నూతన సంవత్సరం (2018) క్యాలెండర్‌ను రాష్ట్ర మానవవనరులశాఖ మంత్రి గంటా శ్రీనువాసురావు ఎంవిపిలో తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు జి. శంతకుమారి, బొత్స దేముడు, మహిళాప్రతినిధి పెందుర్తి దీప్తి, స్పోర్ట్స్ కార్యదర్శి ఎస్. జాకబ్, ఆర్గనైజింగ్ సెక్రటరి తురకపూడి బాలస్వామి, జి.రవి తదితరులు పాల్గొన్నారు.

### బ్రహ్మిన్ పార్లమెంటు సభ్యులు

# వేదుల సూర్యనారాయణ మూర్తి దంపతులకు సన్మానము



అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం సుబ్రహ్మన్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం ఇంటర్నేషనల్ బ్రహ్మిన్ పార్లమెంట్ సభ్యులు అన్నవరం దేవస్థానం వ్రత పురోహితునిగా పనిచేయుచున్న వేదుల సూర్య నారాయణ మూర్తి (సామవేద ఘనపాటి) దంపతులకు సన్మానం చేసారు. అంతర్జాతీయ బ్రాహ్మిన్ పార్లమెంట్ ప్రెసిడెంట్ సుప్రీంకోర్ట్ అడ్వకేట్ సంతోష్ శుక్ల ఆద్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రయ బ్రాహ్మణ సంఘటన అర్చక పురోహిత కన్వెనర్ బండి నరసింహమూర్తి, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోఆర్డినేటర్ దివేదుల దుర్గప్రసాద్ . తూర్పు గోదావరి జిల్లా సంస్థాన మంత్రి చామర్తి సత్యనారాయణ (ఎం.పి) చేతులమీదగా సన్మాన కార్యక్రమం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఆర్.బి.ఎస్ రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పరచిన బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణ సోదరులు, బ్రాహ్మణ సంఘాల సభ్యులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ సంస్థల ద్వారా సమాజంలోని పేద బ్రాహ్మణులకు ఇతోదిక సాయం చేస్తున్నామని, భవిష్యత్లో కూడా ఆ సహాయం కొనసాగిస్తామని తెలిపారు. ముఖ్యంగా అన్నవరం తొండంగి శంకవరం చుట్టుపక్కల ఉన్న బీద బ్రాహ్మణులు వారి ఇబ్బందులను తమ దృష్టికి తెచ్చినట్లైతే సంఘ పెద్దలకు తెలియపరిచి వాటి పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామని చామర్తి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐ.బి.పి రాష్ట్ర ఆర్గనైజర్ ద్వివేదుల దుర్గాప్రసాదరావు, సభ్యులు బండి నరసింహమూర్తి, ద్విభాష్యం జగన్నాధం, కూచిభట్ల ప్రసాద్, ఓలేటి శ్రీనివాసశర్మ, దుడ్డు ధన్వంతరి,చెళ్ళపిళ్ల ప్రసాద్,మొక్కరాల సతీష్, ముత్య సాయి రుషి , కోట కాశీ , తదితరులు పాల్గొన్నారు..

## ఆదరణ కరువైన ప్రజావాణి

ఆలమూరు : జన్మభూమి - మాఊరు కార్యక్రమం అనంతరం సంక్రాంతి పండుగ సందర్భంగా రద్దుచేసిన ప్రజావాణి కార్యక్రమం తిరిగి సోమవారం నిర్వహించారు. అయితే ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజలు ఆదరణ కరువైంది. తహశీల్దార్ కె.పద్మా వతి, మండల ప్రజాపరిషత్ పర్యవేక్షకుడు టి.వి. సురేంద్ర రెడ్డి, ఏఓ కె.వి.ఎన్. రమేష్ కుమార్, ఎమ్ఈఓ ఎన్.రామ చంద్ర రావు, హౌసింగ్ ఎస్.జేజి బాబు , నర్సిపూడి గ్రామ కార్య దర్శి పి.రాజు మాత్రమే హాజరు కాగా, మూలస్థానం అగ్రహారం నుండి బి.సి. కమ్యూనిటీ హాలు నిర్మాణం కోరుతూ ఒకే ఒక అర్జీ రావడంతో ప్రజావాణి కార్యక్రమం ఉనికిని కోల్పోయింది.

# పవన్ కళ్యాణ్ ప్రజాయాత్ర

## దిగ్విజయం కావాలని సత్యదేవునికి ప్రత్యేక పూజలు




అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరంలో సోమవారం పవన్ కళ్యాణ్ కొండగట్టు దగ్గర ప్రారంభమైన ప్రజాయాత్ర దిగ్విజయం కావాలని తుని ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన కార్యకర్తలు బైక్ ర్యాలీగా అన్నవరం వచ్చి సత్యనారాయణ స్వామి తొలిపాంచాల వద్ద కొబ్బరికాయలు కొట్టి యాత్ర విజయం కావాలని సత్యదేవునికి ప్రత్యేక పూజలు చేసారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు మామిడాల.లోకేష్ , బాబీ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# ఇలా అయితే డిస్ట్రిబ్యూటర్లకు బోడి గుండే?




నిన్న మొన్నటిదాకా పైరసీపై గగ్గోలు పెట్టిన సినీ ఇండస్ట్రీ.. డిస్ట్రిబ్యూటర్ల విషయంలో మాత్రం ద్వంద్వ నీతిని పాటిస్తుందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. తమదాకా వస్తేనే బాధ అన్నట్లుగా డిస్ట్రిబ్యూటర్ల విషయాన్ని మాత్రం గాలికొదిలేసిందంటున్నారు. సినిమా విడుదలైన నెల రోజులకే ఆన్ లైన్ వెబ్‌సైట్స్‌లో వచ్చేలా డీల్ కుదుర్చుకోవడం డిస్ట్రిబ్యూటర్లకు తీరని అన్యాయం చేయడమేనన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సినిమా ఇంకా థియేటర్ లో ఉండగానే.. అమెజాన్ ప్రైమ్ లాంటి వెబ్ సైట్లలో దర్శనమిస్తుండటంతో డిస్ట్రిబ్యూటర్లు తీవ్రంగా నష్టపోతున్న పరిస్థితి. ఈ పరిస్థితికి కారణం నిర్మాతలే అవడం మరింత శోచనీయం. కోట్లు పెట్టి సినిమాలు కొనుగోలు చేసే డిస్ట్రిబ్యూటర్ల గురించి నిర్మాతలు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డిస్ట్రిబ్యూటర్ల ఆవేదన: పైరసీని ఎంకరేజ్ చేయవద్దని చెప్పే నిర్మాతలు.. డిస్ట్రిబ్యూటర్ల విషయంలో మాత్రం ద్వంద్వ నీతితో వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆన్‌లైన్ వెబ్‌సైట్లకు అమ్ముకుని సొమ్ము చేసుకోవడం ఓకె కానీ.. సినిమా థియేటర్ లో ఉండగానే సైట్లలో అందుబాటులోకి వస్తే ఇక తాము పెట్టిన డబ్బులు ఎక్కడ వెనక్కి వస్తాయని డిస్ట్రిబ్యూటర్లు ప్రశ్నిస్తున్నారు. అమెజాన్ ప్రైమ్‌లో 'ఎంసీఏ' : గతేడాది విడుదలైన ఎంసీఏ విషయంలోనూ ఇదే జరిగింది. థియేటర్స్ లో జనం సందడి తగ్గకముందే అమెజాన్ ప్రైమ్ లో సినిమా అందుబాటులోకి వచ్చింది. నిర్మాత దిల్ రాజు నుంచి అఫీషియల్‌గా హక్కులు కొన్న అమేజాన్ ప్రైమ్ సంస్థ దర్జాగా ఈ సినిమాను తమ సబ్ స్క్రైబర్స్ కోసం నెట్‌లో ఉంచింది. దీంతో కోట్లు పోసి పంపిణి హక్కులు కొన్న డిస్ట్రిబ్యూటర్స్, థియేటర్ యాజమాన్యాలు మాత్రం నిర్మాతల వైఖరి వల్ల భారీ ఎత్తున నష్టపోతున్నారు.

# ఇంటిలిజెంట్ ఫస్ట్‌లుక్ సూపర్..



సుప్రీమ్ హీరో సాయిధరమ్ తేజ్ కథానాయకుడిగా సెన్సేషనల్ డైరెక్టర్ వి.వి.వినాయక్ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాత సి.కళ్యాణ్ నిర్మిస్తున్న భారీ చిత్రం 'ఇంటిలిజెంట్'. సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై. లిమిటెడ్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను సోమవారం విడుదల చేశారు. ఫిబ్రవరి 9న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత సి కల్యాణ్ మాట్లాడుతూ ''ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ టోటల్‌గా పూర్తయింది. సినిమా చాలా అదుతేంగా వచ్చింది. సాయిధరమ్‌తేజ్ పెర్‌ఫార్మెన్స్, వినాయక్ టేకింగ్ హైలైట్‌గా ఈ చిత్రం రూపొందింది అని అన్నారు. సాయిధరమ్, వినాయక్ కెరీర్‌లో 'ఇంటిలిజెంట్' మరో బిగ్గెస్ట్ హిట్ మూవీ అవుతుంది. అలాగే మా సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌లో మరో కమర్షియల్ హిట్ సినిమాగా నిలుస్తుంది అని నిర్మాత సీ కల్యాణ్ పేర్కొన్నారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులను త్వరగా పూర్తిచేసి ఫిబ్రవరి 9న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం అని కల్యాణ్ అన్నారు. సాయిధరమ్‌తేజ్, లావణ్య త్రిపాఠి, నాజర్, బ్రహ్మానందం, పోసాని క ృష?మురళి, ఆకుల శివ, కాశీ విశ్వనాథ్, ఆశిష్ విద్యార్థి, షాయాజీ షిండే, రాహుల్‌దేవ్, దేవ్‌గిల్, వినీత్‌కుమార్, జె.పి. ప థ్వీ, రుబాబు, కాదంబరి కిరణ్, విద్యుల్లేఖా రామన్, సప్తగిరి, తాగుబోతు రమేష్, భద్రం, నల్ల వేణు, రాహుల్ రామక ృష?, వెంకీ మంకీ, రాజేశ్వరి నాయర్, సంధ్యా జనక్, ఫిష్ వెంకట్, శ్రీహర్ష, శివమ్ మల్హోత్రా, రవిరామ్ తేజ, తేజారెడ్డి నటిస్తున్నారు. కథ, మాటలు: శివ ఆకుల, సినిమాటోగ్రఫీ: ఎస్.వి. విశ్వేశ్వర్, సంగీతం: థమన్, ఎడిటింగ్: గౌతంరాజు, ఆర్ట్: బ్రహ్మ కడలి, ఫైట్స్: వెంకట్, డాన్స్: శేఖర్, జాని, సహనిర్మాతలు: సి.వి.రావు, నాగరాజ పత్సా, నిర్మాత: సి.కళ్యాణ్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వి.వి.వినాయక్.

# రంగస్థలం కథ లీక్..



మెగా హీరో రాంచరణ్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో ప్రతిష్టాత్మకంగా రూపుదిద్దుకొంటున్న చిత్రం రంగస్థలం. ఈ చిత్రాన్ని కొణిదెల ప్రొడక్షన్ కంపెనీ బ్యానర్‌పై సుమారు రూ.100 కోట్ల వ్యయంతో రాంచరణ్ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. రంగస్థలం సినిమాకు సంబంధించిన షూటింగ్ నింపాదిగా నడుస్తున్నప్పటికీ.. వేసవి బరిలో ఈ చిత్రాన్ని వదిలేందుకు ప్లాన్ చేశారు. అయితే ఈ సినిమాకు సంబంధించిన కథ తాజాగా వెలుగులోకి వచ్చింది. మీడియాలో ప్రచారం జరుగుతున్న ప్రకారం రంగస్థలం కథ ఇదేనట.. తండ్రి హత్యతో చిట్టిబాబు (రాంచరణ్) తండ్రి (రాజీవ్ కనకాల) ఓ వర్గానికి నాయకుడు. చిట్టిబాబు చిన్నతనంలోనే వర్గ విభేదాల కారణంగా తండ్రిని కోల్పోతాడు. తన తండ్రిని మట్టుబెట్టిన వారెవరూ అని తెలుసుకొంటూ చిట్టిబాబు వారి భరత పట్టడం సినిమా కథ. పగ, ప్రతీకారం మధ్య ప్రేమ తన తండ్రిని ఎందుకు? ఎవరు చంపారనే విషయాన్ని తెలుసుకోవడంపై కథ నడుస్తుందట. పగ, ప్రతీకారం అంశాల మధ్య సమంత, రాంచరణ్ మధ్య ఓ ప్రేమకథ కూడా ఆసక్తికరంగా సాగుతుందట. సినిమా కథ సాధారణంగా అనిపించినా సుకుమార్ స్టయిల్‌లో ఈ చిత్రం ఉంటుందట. చెర్రీ ప్రియురాలిగా సమంత సమంత ఈ చిత్రంలో లక్ష్మీ అనే పాత్రను పోషిస్తున్నారనేది లేటేస్ట్ న్యూస్. గ్రామీణ ప్రాంత అమ్మాయిగా సమంత విభిన్నమైన పాత్రను పోషిస్తున్నదట. ఈ చిత్రంలో రాంచరణ్, సమంత కెమిస్ట్రీ అదిరిపోయేలా ఉంటుంది అనేది తెలిసింది. 60 నుంచి 80వ దశకం మధ్య రంగస్థలం కథ 60వ దశకంలో ప్రారంభమై 80వ దశకం వరకు సాగుతుందట. అప్పటి వాతావరణం, పరిస్థితులన్నింటిపై పరిశోధన చేసి దర్శకుడు సుకుమార్ ప్రేక్షకులకు థ్రిల్ కలిగించే విధంగా తెరకెక్కిస్తున్నారనేది తాజా సమాచారం. 20 ఏళ్ల కాల పరిమితి దాదాపు 20 ఏళ్ల కాల పరిమితిలో జరిగే సంఘటనలు, వాటికి సంబంధించిన కథనాలను ఆసక్తికరంగా ఉంటాయనేది సినీ వర్గాల కథనం. ప్రేక్షకులకు మళ్లీ పాత రోజులు గుర్తు తేవడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఇప్పటికే ఈ సినిమా స్టిల్స్ సోషల్ మీడియాలో హల్‌చల్ స ృష్టిస్తున్నాయి. అనసూయ పోలీస్ ఆఫీసర్‌గా రంగస్థలంలో అనసూయ పోలీస్ ఆఫీసర్ పాత్రను పోషిస్తున్నట్టు సమాచారం. మర్డర్ కేసుకు సంబంధించిన దర్యాప్తును చేపట్టే అధికారిగా అనసూయ కనిపిస్తుందట. ఈ టాప్ యాంకర్ విభిన్నమైన గెటప్‌తో తెర మీద సందడి చేయనున్నారనేది తాజా సమాచారం. ఆది పినిశెట్టి జిల్లాలో ఉన్నతాధికారిగా కనిపిస్తారట. విలన్ పాత్రలో జగపతి, ప్రకాశ్ రాజ్ గ్రామంలో ఊరి పెద్దలుగా జగపతిబాబు, ప్రకాశ్ రాజ్ నటిస్తున్నారట. ఈ మోతుబరి రైతులు చేసే కుట్రల కారణంగానే రాంచరణ్ కుటుంబం బలైపోతుందట. ఇలాంటి కథతో రంగస్థలం ముస్తాబవుతున్నది. మార్చి 30న రిలీజ్ భారీ తారాగణం, బడ్జెట్‌తో రూపొందిన రంగస్థలం మార్చి 30న రిలీజ్‌కు సిద్ధమవుతున్నది. ఈ చిత్రంపై భారీ మొత్తంలో అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

# ఆర్ఈసీఎస్ చైర్మన్ పదవి పొల్నాటి అప్పారావుకి ఇవ్వాలి



అనకాపల్లి : ఆర్ఈసీఎస్ చైర్మన్ పదవిని జిల్లా తెలుగురైతు సంఘం మాజీ కార్యదర్శి పొల్నాటి అప్పారావుకు ఇవ్వాలని టీఎన్‌టీయూసి విశాఖ జిల్లా అధికార ప్రతినిధి బలిరెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేసారు. మార్టూరులో ఏర్పాటైన టీడీపీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ వైసీపీ నాయకులే ఆర్ఈసీఎస్ సంస్థను భ్రష్టు పట్టించారని ఆరోపించారు.

టీడీపీ ఆద్వర్యంలో సంస్థ అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. ఈ దఫా చైర్మన్ పదవిని టీడీపీకి విధేయుడుగా ఉన్న సీనియర్ నాయకుడు పోల్నాటి అప్పారావుకు ఇవ్వాలని అన్నారు. పోల్నాటి అప్పారావు పార్టీ ఆవిర్భం నుంచి తెలుగుదేశం పార్టీకి వివిధ హోదాల్లో పనిచేసారని, మండల అధ్యక్షులుగా పనిచేసారని తెలుగు రైతు జిల్లా ప్రదాన కార్యదర్శిగా జిల్లా కమిటీలో సభ్యునిగా సేవలు అందించిన చరిత్ర ఉందని, 1995 లోనే తన భార్యను జెడ్పీటీసీగా నిలబెట్టి పార్టీకి విశేష సేవలు అందించారని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సలాది చంద్రావతి, టీడీపీ నాయకులు పొల్నాటి అప్పారావు, వి. రాజు, మాటూరి చిన్నారావు, పొల్నాటి నాగేశ్వరారవు కరణం వాసు తదితరులు పాల్గొన్నారు.

# వ్యాయామంతో ఆరోగ్యకర జీవితం : ఛైర్మన్ చిక్కాల

అమలాపురం : ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యకర జీవితం గడపవచ్చునని అమలాపురం మున్సిపల్ ఛైర్మన్ చిక్కాల గణేష్ అన్నారు. హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ ఆధ్వర్యంలో మొట్టమొదటి కోనసీమ వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలను బండారు హొండా ఎండి బండారి సంజీవ్ లిఫ్టింగ్ సెట్‌ను లిఫ్ట్ చేసి ప్రారంభించారు. ఈ పోటీలలో సుమారు 45మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. అనంతరం కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షులు వంటెద్దు వెంకన్నాయుడు అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్మన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా చేయడం వల్ల మానసిక ఆనందంతో పాటు శారీరక దృఢత్వాన్ని పొంది తద్వారా సమాజానికి మంచి సంకల్పం కలిగిన వ్యవస్థను మనం నిర్మించుకోవచ్చని తెలిపారు. ఇటువంటి క్రీడా పోటీలకు తన ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందని, పోటీలో పాల్గొన్న క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ ఛైర్మన్ కుడుపూడి సూర్యనారాయణరావు, ప్రసిద్ధ ఇంజనీరింగ్ కాలేజీ ఛైర్మన్ మిండగుదిటి రామ్మోహనరావు, సీనియర్ టిడిపి నాయకులు యనమల కృష్ణపద్మరాజు, అమలాపురం మున్సిపల్ కౌన్సిలర్లు ఆశెట్టి ఆదిబాబు, బండారు సత్యనారాయణ, యక్కల సాయిలక్ష్మి, జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ అధ్యక్షులు పప్పుల శ్రీరామచంద్రమూర్తి, చిట్టూరి చంద్రశేఖర్, దొమ్మేటి వెంకటరమణ, చిక్కం రాజబాబు, కరాటం రవిసుధీర్, కోడూరి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన విజేతల వివరాలను ఆర్గనైజర్ జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలియజేసారు. వెయిట్ లిఫ్టింగ్‌లో 62కేజీల విభాగంలో ఎస్.బి.మహేష్, ఎస్.ఎన్.వి.ఎస్.నారాయణ, ఎస్.ఎస్.రాయ ుడు, 69కేజీల విభాగంలో బి.సతీష్, కె.నాగేంద్ర, ఎన్.యోగేష్, 77కేజీల విభాగంలో ఎం.వీరేంద్ర, జి.ఎస్.ఎన్.మూర్తి, పి.ఆనందకుమార్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను గెలుపొందారు. పవర్ లిఫ్టింగ్ పోటీలలో 66కేజీల విభాగంలో ఎస్.ఎస్.రాయుడు, ఎస్.వి.మహేష్, కె.నాగేంద్ర, 74కేజీల విభాగంలో వి.విన్ను, బి.సతీష్, సి.శ్రీమ్, కిరణ్‌కుమార్, 83కేజీల విభాగంలో ఎం.వీరేంద్ర, ఎం.రాహుల్, ఎ.ఆనందకుమార్, 93కేజీల విభాగంలో జి.ఎస్.ఎన్.మూర్తి, ఎ.ప్రసాద్, ఎం.ఎన్.వి.ఎస్.నేతికొండలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను గెలుపొందారు.

# అరచేతుల్లో ఆరోగ్యం...

విజయనగరం:పొషికాహారాన్ని తీసుకుంటే...వంటగదిని ఆరోగ్య మందిరంగా మలుచుకుంటే అనారోగ్యం దరిచేరదని న్యూట్రీషన్ వీరమాచనేని రామకృష్ణారావు తెలిపారు. విజయవాడకు చెందిన రామకృష్ణారావు స్థానిక కాకతీయకల్చరల్ అసోసియేషన్ నిర్వహణలో ఆదివారం జరిగిన అవగాహన సదస్సులో ప్రసంగించారు.సమతుల్య ఆహారం తీసుకోనందు వల్లనే ఆనారోగ్యం మనను వేధిస్తున్నాదని తెలిపారు. నూనె ధారాళంగా వాడటం వల్ల ఊబకాయం...బి.పీ, సుగర్ వస్తున్నాయని తెలిపారు. కొబ్బరినూనె లేదా తెనెతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. సినీనటులు బాబూఊఊమోహన్ (ఎమ్మెల్యే), హైదరాబాద్ నుంచి ఈ సదస్సుకు హాజరైయ్యారు. రెండు నెలల్లో 20 కిలోలు తగ్గటం సామాన్యవిషయం కాదని ఆ ప్రతిభ రామకృష్ణారావుదే నని తెలిపారు. కాకతీయ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు కిలారు సాంబశివరావు, టి.అప్పారావు. జె.శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు. వేలాదిగా తరలివచ్చిన సబికులను ఉద్దేశించి వారి ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

# నర్సీపట్నం నియోజకవర్గ సోషల్ మీడియాకు సీఎం అభినందన

నర్సీపట్నం: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నర్సీపట్నం నియోజకవర్గ సోషల్ మీడియాను అభినందించారు. ఆదివారం అమరావతిలో సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, జిల్లా నాయకులతో సమావేశంలో సోషల్ మీడియాలో ఇటీవల నిర్వహించిన జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో ఎన్ని లైవ్ వీడియోలు, ఏయే ప్రాంతాల నుంచి వచ్చాయనే విషయంపై సమీక్షించారు. ప్రధానంగా విశాఖజిల్లా నర్సీపట్నం నియోజకవర్గంలో సోషల్ మీడియా 36లైవ్ వీడియాలు పోస్ట్ చేసి ప్రథమ స్థానంలో అభినందించినట్లు నర్సీపట్నం సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ముమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తెలిపారు.

# ఆద్యంతం.. ఆసక్తికరంగా..



విజయనగరం: ఆంధ్రా బ్యాడ్మింటెన్ లీగ్ విజయనగరంలో ఏర్పాటు చేయడం ముదావహమని... ఈ ప్రాంత క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని సిటీ బ్యాడ్మింటెన్ అసోసియేషన్ అధ్యక్షులు వి.ఎస్.ప్రసాద్ అన్నారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో జరిఇన ఆంధ్రా బ్యాడ్మింటెన్ లీగ్ పోటీలను, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరావు పోటీలను ప్రారంభించారు. టి.ఎస్‌రెడ్డి గోదావరి గన్స్ క్రీడాకారులు ఈ పోటీల్లో తమ సత్తాను చాటారు . సింగిల్స్ మేచ్‌లో పురుషుల విభాగంలో విజయనగరం స్టీల్స్ క్రీడాకారుడు సి.ఉపేంద్రపై గోదావరి గన్స్ క్రీడాకారుడు కె.సాయిచరణ్ 15-7, 15-14 స్కోర్ తేడాతో విజయం సాధించాడు. బాలికల విభాగంలో విజయనగరం స్టీల్ గెయింట్స్ క్రీడాకారిణిపై గోదావరి గన్ఎస క్రీడాకారిణి డి.సుధాకళాయణి 15-8,15-11,స్కోర్ తేడాతో విజయం సాధించారు. డబుల్‌స విభాగంలో విజయనగరం స్టీల్స్ గెయింట్స్ క్రీడాకారులు బి.కిరణ్‌కుమార్, హేమనాగేంద్రబాబుపై గోదావరి గన్స్ క్రీడాకారులు కె.నందగోపాల్,వి.గంగాధర్‌రావు 15-11,15-11 స్కోర్ తేడాతో విజయం సాధించారు. ఆద్యాంతం ఎంతో ఆసక్తిగా సాగిన ఈ పోటీల పలువురిని ఆకట్టుకున్నాయి. రాత్రి 9 గంటలకు మరలా మరో సింగిల్‌లో ఆర్.సంజీవరావు,కె.సాయిచరణ్ మధ్య మిక్స్‌డ్ డబుల్‌స విభాగంలో విజయనగరం స్టీల్ గెయింట్స్ క్రీడాకారులు డి.పైజ, టి.హేమనాగేంద్రబాబు, గోదావరి గన్ఎస క్రీడాకారులు డి.సుధారాణి, కె.నందగోపాలల్ మధ్య రసవత్తరంగా ఆట సాగింది. పోటీలకు న్యాయనిర్ణేతలుగా వెంకటేశ్వరరావు, శ్రీరాములు, కె,రవి వ్యవహరించారు. కార్యక్రమంలో విశాఖ బుల్లయ్యకళాశాల ప్రిన్సిపల్ వై.పోలిరెడ్డి, అసోసియేషన కార్యదర్శి కుసుంబచ్చన్, గోదావరి గన్ఎస ప్రొంచైజర్ ఎ.భానుమురళీ, డి.ఎస్.డి.ఓ తదితరులు పాల్గొన్నారు.

# రోలుగుంట సిపిఐ కార్యదర్శిగా లెనిన్ ప్రసాద్

రోలుగుంట: రోలుగుంట సిపిఐ కార్యదర్శిగా గోలకొండ లెనిన్‌ప్రసాద్ ఎన్నికైనట్లు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ ప్రకటించారు. 3వ మహాసభలో హాజరైన 84 మంది కార్యకర్తల నుండి 12 మంది సమితి సభ్యులుగా ఎన్నిక కాబడ్డారన్నారు. సమితి నుండి మండల కార్యదర్శిగా మండలంలోని శరభవరం గ్రామంకి చెందిన లెనిన్ ప్రసాద్‌ని ఎన్నుకున్నారన్నారు. గతంలో ఇతను ఏఐవైఎఫ్ బాధ్యతలు నిర్వహించారు.

# 36 గంటలు అనంతరం గల్లంతైన వికాస్ మృతదేహం లభ్యం

ఆలమూరు :- రావులపాలెం మండలం, ఊబలంక రెవిన్యూ పరిధి తోకలంక వద్ద గోదావరిలో శనివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఆలమూరు మండలం, జొన్నాడ గ్రామానికి చెంది ఇద్దరు యువకులు తలారి ధర్మేంద్ర, గంటా వికాస్‌లు నీటమునిగి గల్లంతవ్వగా శనివారం చీకటిపడే సమయానికి ధర్మేంద్ర మృతదేహం లభ్యమైంది. వికాస్ మృతదేహం కోసం, ఆలమూరు, రావులపాలెం పోలీసు, రెవిన్యూ శాఖలు సంయుక్తంగా ఆదివారం వేకువజాము నుండి పొద్దుపోయే వరకు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకి లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులు, ఇటు అధికారులు ఆందోళన చెందారు. అయితే సోమవారం వేకువజామునే కుటుంబ సభ్యులు, స్థానికులు వికాస్ ఆచూకీ కోసం సంఘటనా స్థలానికి చేరి గాలిస్తుండగా నీటమునిగిన ప్రాంతంలోనే మృతదేహం తెల్లవారు జామున 5గంటలకు లభ్యం కావడంతో ఇటు అధికారులు, అటు స్థానికులు కుటుంబీకులు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో రావులపాలెం ఎస్.ఐ. సిహెచ్ విద్యాసాగర్ పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించి, అనంతరం జొన్నాడలో మృతుని కుటుంబీకులకు మృతదేహాన్ని అప్పగించారు.

# గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

నాతవరం: గుండెపోటుతో నాతవరం హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయునిగా పని చేస్తున్న అనంత రామచంద్రయ్య మృతి చెందారు. నాతవరం మండలం వెన్నలపాలెం గ్రామానికి చెందిన ఈయన ఆదివారం 4 గంటలకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఈయన మృతి పట్ల ఎంఇఒ అమృతకుమార్, హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ద్రిగ్భాంతి వ్యక్తం చేశారు.

## స్పోర్ట్స్‌లో ప్రతీ ఒక్కరూ
# ఉత్సాహంగా పాల్గోవాలి

- చదువుతో పాటు ఆటలలోనూ రాణించాలి
- ఇండోర్ స్టేడియంను ప్రారంభించిన గంటా



భీమునిపట్నంః స్థానిక కుమ్మరి పాలెంలో 3.84 కోట్లతో నిర్మించిన ఇండోర్ స్టేడియంను గంటా శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పోర్ట్స్‌లో ప్రతీ ఒక్కరు ఉత్సాహంగా పాల్గోవాలనీ ప్రతీ ఒకరు చదువుతో పాటు ఆటలలో కూడా రాణించాలని అన్నారు. ప్రతీ స్కూల్ కి పి.ఇ.టి.ని నియమించాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎం.పి.పి.యరబాల కృష్ణవేణి, అనిల్ ప్రసాద్, ఇన్ ఛార్జ్ సి.హెచ్. విజయ్ బాబు, మార్కెట్ కమిటీ చైర్మెన్ కోరాడ నాగభూషణ రావు, మణిశంకర్ నాయుడు, టి.డి.పి. జిల్లా రూరల్ మహిళా అద్యక్షురాలు కురిమిన లీలావతీ, భీమిలి, తగరపువలస డివిజన్ టీడీపీ అధ్యక్షుడు గంటా నూకరాజు, కొప్పల రమేష్ ,తహశీల్దార్ గంగాధరావు, కమీషనర్ బి. సన్యాసి నాయుడు, వుడా అధికారి శ్రీనివాస్, ఇ.ఇ. పద్మావతి మాజీ ఎంపిపి గాడు వెంకటప్పుడు, బమ్మిడి ఉమా, జహనారా, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సియట్ ప్రచారకర్తగా భారత మహిళా క్రికెటర్ కౌర్

న్యూఢిల్లీ : భారత మహిళా క్రికెటర్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కి అరుదైన అవకాశం దక్కింది. ప్రముఖ టైర్ల ఉత్పత్తి సంస్థ 'సియట్' రెండేళ్లపాటు తమ ప్రచారకర్తగా హర్మన్‌ప్రీత్ కౌర్‌ని నియమించుకుంది. ఈ మేరకు ఒప్పందంపై మహిళా క్రికెటర్ సంతకం చేసినట్లు సోమవారం వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే సియట్ కంపెనీ స్టిక్కర్ ఉన్న బ్యాట్‌తో రోహిత్ శర్మ, అజింక్య రహానె, ఇషాన్ కిషన్ క్రికెట్ మ్యాచ్‌లు ఆడుతుండగా.. ఒక మహిళా క్రికెటర్‌తో సియట్ ఒప్పందం చేసుకోవడం ఇదే తొలిసారి.

## గంటకు 218 కి.మీ. వేగంతో
# ఆడి క్యూ-5

- ఆడి వర్చువల్ కాక్‌పిట్, ఎంఎంఐ నావిగేషన్ సౌకర్యాలు
- 7.9 సెకన్ల వ్యవధిలో 0-100 కి.మీ. వేగం
- ఉభయ రాష్ట్రాల్లో 510 యూనిట్ల ఆడి విక్రయాలు
- 3,500 మంది కస్టమర్ల ఆకర్షణ
- విశాఖ ఆడి సీఈవో జెరోమి అడ్వర్డ్



విశాఖపట్నం : లగ్జరీ వాహనాలను వినియోగించే వాహనదారులకోసం ఆడి సంస్థ తాజాగా ఆడి క్యూ-5 సెకండ్ జనరేషన్ కారును విశాఖపట్నం మార్కెట్లోకి విడుదల చేసినట్లు విశాఖ ఆడి సీఈవో జెరోమి అడ్వర్డ్ ఒక ప్రకటనలో తెలిపారు. డిజైన్, డ్రైవింగ్, ఎక్స్‌పీరియన్స్‌ను ఈ సరికొత్త కారు అందిస్తుందని, తెలుగు రాష్ట్రాల్లో లగ్జరీ వాహనాలకు డిమాండ్ పెరుగుతోందని సంఫ్వీ తెలిపారు. గత ఏడాదిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 510 కార్లను విక్రయించామని, ఇందులో 414 కార్లను హైదరాబాద్‌లో, 96 కార్లను విశాఖపట్నం షోరూమ్‌ల ద్వారా విక్రయించినట్లు సీఈవో పేర్కొన్నారు. ఈ ఏడాది అమ్మకాల్లో రెండంకెల వృద్ధి నమోదు కావచ్చని ఆయన తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో లగ్జరీ కార్ల మార్కెట్లో తమ వాటా 20 శాతం ఉందని చెప్పారు. రెండో తరం ఆడి క్యూ-5 కారును విడుదల చేసిన సందర్భంగా పై విషయాలను వెల్లడించారు.

ఈ కారు ప్రారంభ ధర 53.25 లక్షల రూపాయలుగా ఉందని అన్నారు. పాత మోడల్‌తో పోల్చితే దీని బరువు 90 కిలోలు తగ్గిందని, భద్రతా ఫీచర్లను మరింతగా పెంచడం జరిగిందని తెలిపారు. పవర్ డెలివరీ 8 శాతం, ఇంధన సామర్థ్యం 20 శాతం మేర పెరిగిందని అన్నారు. 7.9 సెకన్ల వ్యవధిలో 0-100 కిలో మీటర్ల వేగాన్ని క్యూ-5 అందుకుంటుందని సీఈవో జెరోమీ అడ్వర్డ్ పేర్కొన్నారు. గరిష్టంగా గంటకు 218 కిలో మీటర్ల వేగంతో ప్రయాణిస్తుందని, ఆడి వర్చువల్ కాక్‌పిట్, ఎంఎంఐ నావిగేషన్, ఎంఎంఐ టచ్, స్మార్ట్ ఫోన్, ఇంటర్‌ఫేస్, ఫోన్ బాక్స్, క్యుఐ-వైర్‌లెస్ చార్జింగ్ తదితర ఫీచర్లతో ఈ కారు మార్కెట్లోకి విడుదలచేయబడిందని అన్నారు. ఇప్పటికే తొమ్మిది కార్లకు బుకింగ్ ప్రారంభమైందని అంటూ ఆడి క్యూ-5 2009వ సంవత్సరం నుంచి వినియోగదారుల మన్ననలను అందుకుంటోందని ఆడి ఇండియా హెడ్ రాహిల్ అన్సారీ తెలిపారు.

## కుంబ్లే కంటే తక్కువస్థాయి వ్యక్తి శాస్త్రి : రామచంద్ర గుహ

దిల్లీ: బీసీసీఐ అధికారులు, సెలక్టర్లు, కోచింగ్ సిబ్బంది భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లీ ముందు మోకరిల్లుతున్నారని విమర్శించిన బోర్డు పాలకుల కమిటీ మాజీ సభ్యుడు రామచంద్ర గుహ తాజాగా కోహ్లీ ఒత్తడి మేరకే రవిశాస్త్రిని కోచ్‌గా ఎంపిక చేశారని అన్నారు. తాజాగా ఓ వ్యాసంలో ఆయన బోర్డు అధికారులకు పలు ప్రశ్నలు సంధిస్తూ రవిశాస్త్రి ఎంపికను ఎండగట్టారు.

భారత క్రికెట్ జట్టు విజయాల్లో కీలకపాత్ర లేని, కోచింగ్‌లో ఏమాత్రం అనుభవం లేని రవిశాస్త్రిని భారత జట్టు ప్రధాన కోచ్‌గా ఎంపిక చేయడానికి ప్రధాన కారణం సారథి విరాట్ కోహ్లీ. శాస్త్రినే కోచ్‌గా తీసుకోవాలని కోహ్లీ నుంచి బీసీసీఐకు తీవ్ర ఒత్తిడి వచ్చింది.

ఈ ఒత్తిడికి తలొగ్గే రవిశాస్త్రిని ఎన్నుకున్నారు. మాజీ కోచ్ అనిల్ కుంబ్లేకు శాస్త్రి ఏ విషయంలోనూ



పోటీ ఇవ్వలేడు. కుంబ్లే జట్టు విజయాల కోసం ఒంటరిగా పోరాడిన సందర్భాలు ఉన్నాయి. అతని కారణంగా భారత జట్టు మరపురాని విజయాలు సాధించిన సంగతి తెలిసిందే. అలాంటి ఆటగాడిని కాదని కోచ్‌గా ఏమాత్రం అనుభవం లేని శాస్త్రికి పట్టంకట్టాం.

కోచ్ పదవి కోసం ఆసీస్ మాజీ ఆటగాడు టామ్ మూడీ కూడా దరఖాస్తు చేసుకున్నాడు. అతనికి కోచ్‌గా చాలా అనుభవం ఉంది. అతన్ని సైతం కాదని రవిశాస్త్రినే ఎంచుకోవడానికి కారణం ఏమిటి?. బీసీసీఐ క్రికెట్ సెలక్షన్ కమిటీపై కోహ్లీ తీసుకువచ్చిన ఒత్తిడే. స్వదేశంలో బలహీన జట్లతో భారత్ ఆడినప్పుడు ఈ తప్పుడు నిర్ణయం తాలుకు ప్రభావం కనిపించలేదు అని గుహ ఓ వ్యాసంలో పేర్కొన్నారు.

ప్రస్తుత దక్షిణాఫ్రికా సిరీస్ గురించి మాట్లాడుతూ..జట్టులో ఎవరు ఆడినా ఆడకపోయినా, శ్రీలంకతో ఆడటం మాని రెండు వారాల ముందు మన జట్టు సఫారీ గడ్డపై అడుగుపెట్టి ఉంటే ఫలితాలు వేరుగా ఉండేవి అని గుహ తెలిపారు.

# మాతృదేవోభవ

## తొలివందనం తల్లికే
## రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమం భేష్



విశాఖపట్నంః భారత దేశంలో మానవీయ విలువలు, సంస్కృతి గొప్పవని ప్రపంచ దేశాల ప్రజలు ఆకర్షితులవుతున్నారని రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఉదయం మధురవాడ, చంద్రంపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'అమ్మకు వందనం' కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో అమ్మకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారన్నారు. ఇది గొప్ప కార్యక్రమమని, మనసా వాచా కర్మణా తల్లిదండ్రులను గౌరవించాలని, నిత్యం మన ఆలోచనల్లో తల్లి ఉండాలని మంత్రి సూచించారు. తల్లి పట్ల ప్రేమ, అభిమానము పిల్లలందరిలో అంతర్లీనంగా ఉంటుందన్నారు. విద్యార్థులందరకూ తల్లి ప్రాధాన్యత తెలుసునన్నారు. పిల్లలకు తల్లిదండ్రులే ప్రపంచమని, తల్లి, తండ్రి, గురువు దైవంతో సమానమని తెలిపారు. ఇతర దేశాలలో తల్లిదండ్రుల రోజు, తల్లుల రోజును జరుపుకుంటారని, కాని ఇక్కడ జీవితాంతం వారితో కలిసే ఉంటామన్నారు.

రూ. 35 లక్షలతో చంద్రంపాలెం పాఠశాలకు అవసరమైన అభివృద్ధి పనులను చేయిస్తామన్నారు. అంతకు ముందు ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. వసంత పంచమి రోజున రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అమ్మకు వందనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడాన్ని అభినందించారు. తల్లిని వారు భగవంతుడుగా అభివర్ణించారు. మొట్టమొదటి నమస్కారం తల్లికే అని శాస్త్రం చెబుతోందన్నారు. బిడ్డ తల్లికన్నా భిన్నం కాదని, బిడ్డకు తల్లి రక్తం పాలగా మార్చి పోషిస్తుందన్నారు. అమ్మకంటే స్థితికర్త ఉండబోదని, అమ్మలాంటి వ్యక్తి సృష్టిలో వేరొకరు ఉండరన్నారు. నిస్వార్థంగా బిడ్డల క్షేమం కోరేది అమ్మ అని చనిపోయేటపుడు కూడా పిల్లల క్షేమం కోరేది తల్లే అన్నారు. పిల్లల ఆరోగ్యం, క్షేమం, అభివృద్ధి కోసం తల్లి ఎంతగానో తాపత్రయ పడుతుందన్నారు. పిల్లలందరిలో మంచి సంస్కృతి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమం ఎంతో గొప్పదన్నారు. పిల్లలు తల్లిని గౌరవించాలని, ప్రతీ రోజూ తల్లికి నమస్కరించాలని అన్నారు. అమ్మ మాట అమలు చేస్తే ప్రతీ బిడ్డ భవిష్యత్తు బంగారం కాగలదన్నారు. మంత్రి గంటా శ్రీనివాసరావు తనను ఈ కార్యక్రమానికి తప్పక వచ్చి విద్యార్థులకు మంచి మాటలు చెప్పాలని అన్నారని, ఇంత గొప్ప కార్యక్రమానికి ప్రభుత్వ పరంగా నిర్వహించడాన్ని వారు కొనియాడారు. రాష్ట్రంలో కుటుంబ సంబంధాలు, సత్సంప్రదాయాలు ఏర్పడాలని కోరుకుంటున్నానన్నారు. తదుపరి వారు విద్యార్థులచే అమ్మకు వందనం ప్రతిజ్ఞను చేయించారు. విద్యార్థులందరిచే వారి తల్లుల పాదాలను శుభ్రపరిచి, పూలు, అక్షింతలుతో పాద పూజ చేసి వారి ఆశీర్వాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తల్లిని గౌరవిస్తూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం పాటలను పాడడం చేశారు. అంతకు ముందు చాగంటి కోటేశ్వరరావు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి లింగేశ్వరరావు, ప్రాజెక్టు ఆఫీసర్, సర్వశిక్ష అబియాన్, పలువురు అధిక సంఖ్యలో అధికారులు, అనధికారులు, విద్యార్థులు , వారి తల్లులు పాల్గొన్నారు.



## గవర్నర్ ఆహ్వానం తిరస్కరించిన సీపీఐ నారాయణ



హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ఆహ్వానాన్ని సీపీఐ జాతీయ నేత నారాయణ తిరస్కరించారు. జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించే ఎట్‌హోం కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ ఆయన ఆహ్వానం పంపగా.. తాను హాజరు కాలేకపోతున్నానని నారాయణ స్పష్టంచేశారు. ఈ సందర్భంగా నారాయణ గవర్నర్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. గవర్నర్ అంటే వ్యక్తిగతంగా తనకు గౌరవమేనన్నారు. కానీ ఆ హోదాలో ఆయన చేస్తున్న వ్యాఖ్యలు, వ్యవహరిస్తున్న తీరు మాత్రం అసంత ృప్తిగా ఉన్నాయని నారాయణ అభిప్రాయడ్డారు.






## 2024కు ముందు జమిలి సాధ్యం కాదు : మాజీ సీఈసీ టీఎస్ కృష్ణమూర్తి

హైదరాబాద్: లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు 2024కు ముందు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడమనేది సాధ్యం కాదని కేంద్ర ఎన్నికల సంఘం మాజీ ప్రధాన కమిషనర్ టీఎస్ కృష్ణమూర్తి అన్నారు. జమిలి ఎన్నికల నిర్వహణకు రాజ్యాంగ సవరణ అవసరమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఏకకాలంలో ఎన్నికలు జరగాలన్న అంశంపై ప్రధాని మోదీ పదే పదే ప్రస్తావిస్తున్న సందర్భంగా పీటీఐతో ఆయన మాట్లాడారు.

ఐదేళ్లకోసారి ఏకకాలంలో దేశవ్యాప్త ఎన్నికలు అనేది మంచి విషయమన్నారు. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సిఫార్సు మేరకు ఒకే ఏడాది లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడం వీలు పడుతుందని, అందుకు కొంత అధ్యయనం,



రాజ్యాంగ సవరణ అవసరమని పేర్కొన్నారు. పాలనా పరంగా, వ్యయ పరంగా జమిలి ఎన్నికలతో మేలు జరుగుతుందన్నారు. దీంతో పాటు ప్రతీకార రాజకీయాలు, ప్రచారాలు, వ్యక్తిగత దూషణలు వంటివి తగ్గుముఖం పడతాయని అభిప్రాయపడ్డారు.

అయితే, 2019లో ఏకకాల ఎన్నికలు సాధ్యం కాకపోవచ్చని కృష్ణమూర్తి పేర్కొన్నారు. గతేడాది కొన్ని రాష్ట్రాలకు ఎన్నికలు జరగడం, ఈ ఏడాది మరికొన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరుగుతుండడం వల్ల అది సాధ్యపడదని పేర్కొన్నారు. 2024 నాటికి అది సాకారం అయ్యే అవకాశం ఉందన్నారు. జమిలి ఎన్నికల అంశం ప్రధాని మోదీ అభిలాష మాత్రమే కాదని, ఎన్నికల సంఘం సైతం అదే కోరుకుంటోందని చెప్పారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com